నేటి కందం- నేటికి అందం

సారస్యపు స్వేఛ్ఛా వ్యా
పారమునకు భారతమ్ము ద్వారము తెరువన్
ధీరగ నది మది నిలచెను
సారపు యూరోపియనుల సంఘమ్మునకున్ !!
(27 యూరోపియన్ దేశాల సంఘంతో స్వేఛ్ఛా వ్యాపార ఒప్పందం కుదుర్చుకొని వారందరికి భారత్ చాలా ప్రీతిపాత్రం అయింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail:netinijam93@gmail.com

కార్పోరేట్ల ఎదుగుదలే
కాగలదా దేశ ప్రగతి
అవుతుంటే ప్రజలింకా
ఆర్థికంగా అదోగతి
వికసిత భారతంటూ
విశ్వగురు స్వరం మీటు
పార్లమెంటు సాక్షిగా
ప్రభుత్వం ఘనత చాటు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 30-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:142 పేజీలు:6 వెల: రూ.1/-

## ఈ ప్రపంచానికి భారత్ ఒక ఆశాకిరణం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 29: బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ (గురువారం) పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా యూరోపియన్ యూనియన్ తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. ఆ ఒప్పందం శుభసూచకమని చెప్పారు. రీఫార్మ్- పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బడ్జెట్ టోన్‌లో ఆయన మాట్లాడారు.

ప్రస్తుతం భారతదేశం రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లబిస్తున్నదని ప్రధాని మోదీ చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబించిందని తెలిపారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని, అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోందని అన్నారు. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలని చెప్పారు. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోందని ప్రధాని అన్నారు. ట్రేడ్ డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వాటి నుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నానని, ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతామని, దానిని అందిపుచ్చుకుంటావని, దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తామని, అయితే అది మనుషులను భర్తీ చేయలేదని వ్యాఖ్యానించారు.

## నాంపల్లి అగ్ని ప్రమాదంపై హైడ్రా సీరియస్

హైదరాబాద్, జనవరి 29: హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఇటీవల బచ్చాన్ ఫర్నిచర్ షాపులో జరిగిన భారీ అగ్నిప్రమాదం తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఐదుగురు (ఇద్దరు చిన్నారులతో సహా) సజీవ దహనమయ్యారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.. మరోసారి ఇలాంటి దుర్ఘటనలు జరుగకుండా చర్యలకు ఉపక్రమించారు.

అగ్నిప్రమాదం నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా సిబ్బంది, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు రంగంలోకి దిగారు. నాంపల్లి ప్రాంతంలోని పలు ఫర్నిచర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అగ్నిమాపక నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎగ్జిట్ మార్గాలను అడ్డుకుంటూ స్టాక్ ఉంచినట్లు గుర్తించారు.

భద్రతా ప్రమాణాలు పాటించని కొన్ని షాపులను అధికారులు తక్షణమే సీజ్ చేశారు. సెల్లార్లను పార్కింగ్ కోసం కాకుండా గోదాములుగా వాడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు.

అగ్నిప్రమాదాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు హైడ్రా ఒక ప్రత్యేక వాట్సాప్/కంట్రోల్ రూమ్ నంబర్ 90001 13667ను అందుబాటులోకి తెచ్చింది.

## ఆకట్టుకున్న 'బీటింగ్ రిట్రీట్'



న్యూఢిల్లీ, జనవరి 29: దేశ రాజధాని ఢిల్లీలోని విజయ్ చౌక్ ప్రాంతంలో నిర్వహించిన 'బీటింగ్ రిట్రీట్' కార్యక్రమంతో 77వ గణతంత్ర దినోత్సవాలకు తెరపడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి వర్గంలోని పలువురు సభ్యులు పాల్గొన్నారు. అలాగే త్రివిధ దళాధిపతులు హాజరయ్యారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. సాయుధ దళాల నుంచి జాతీయ గౌరవ వందనం స్వీకరించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. రాష్ట్రపతి ముర్ము ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సంప్రదాయ రీతిలో గుర్రపు బగ్గీలో విచ్చేశారు. ఈ కార్యక్రమంలో త్రివిధ దళాలకు చెందిన బ్యాండ్ బృందాలు ప్రదర్శించిన విన్యాసాలు, దేశభక్తి గీతాలాపన చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ సైనిక సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమం, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచింది. సూర్యాస్తమయ సమయానికి జాతీయ జెండాను అవనతం చేయడంతో గణతంత్ర ఉత్సవాలు అధికారికంగా ముగిశాయి. ఈ వేడుకలో ప్రధానమంత్రి మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దేశ రక్షణలో సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ, ఈ కార్యక్రమం భారత ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు.

బీటింగ్ రిట్రీట్..

బ్రిటన్ రాణి ఎలిజబెత్, ప్రిన్స్ ఫిలిప్‌లు 1955లో భారత సందర్శనకు వచ్చిన సందర్భంగా మొట్టమొదటి సారిగా 'బీటింగ్ రిట్రీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటి నుంచి ఈ కార్యక్రమం ఏటా పాటించే సంప్రదాయంగా మారింది. బీటింగ్ రిట్రీట్ వేడుక అనేది గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల ముగింపును అధికారికంగా సూచిస్తుంది. ఇందులో ఆర్మీ, నేవీ, వైమానిక దళానికి చెందిన బ్యాండ్‌లు.. దేశభక్తి గీతాలు, కవాతు గీతాలను ప్లే చేస్తూ సమన్వయంతో ప్రదర్శనలు జరుగుతాయి. ఈ కార్యక్రమం సందర్భంగా ఢిల్లీలోని ప్రభుత్వ భవనాలను విద్యుత్తు దీపాలతో అలకరించారు.

## సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే మమునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

హైదరాబాద్, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చొరవ వల్లే మమునూరు ఎయిర్ పోర్ట్ కల నెరవేరుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు మమునూరు అతిపెద్ద ఎయిర్ పోర్ట్‌గా ఉండేదని అన్నారు. మమునూరు ఎయిర్ పోర్ట్‌కు 696 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే 180 సీట్ల విమానం దిగాలి అంటే రన్ వే పొడవు 2500 మీటర్లు ఉండాలని మంత్రి తెలిపారు

మమునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరాలంటే మరో 259 ఎకరాలు అవసరమని మంత్రి తెలిపారు. గతంలో ఎవరూ ఆ భూమిని సేకరించలేదని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లో రైతులను ఒప్పించి భూమి సేకరించిందని ప్రశంసించారు. ఏవియేషన్ మంత్రిగా ఎక్కువ ఎయిర్ పోర్ట్‌లు నిర్మించాలనేది తన లక్ష్యమని, రాష్ట్రాలు సహకరించి భూములు ఇస్తే కొత్త ఎయిర్ పోర్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత గొప్ప వారసత్వ నగరమైన వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా నిర్మాణం చేసుకోలేక పోయామని, ఇప్పుడు ఆ కల నెరవేరతోందని అన్నారు.

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ 5వేల ఎకరాలతో నిర్మిస్తాం అంటే అందరూ నవ్వారని, అన్ని వేల ఎకరాలు ఉండటం వల్లే నేడు ఆపరేషన్, మెంటైనెన్స్, రిపేర్ కేంద్రాలకు వీలు అవుతోందని మంత్రి పేర్కొన్నారు . అందువల్లే హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా ఎదిగిందన్నారు. పోటీపడి రాజకీయాలు చేయడం కాదు.. అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు నేర్పించారని అన్నారు. తెలంగాణను కూడా అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు చెప్పారని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## గోడౌన్ల అగ్నిప్రమాదం ఘటనలో 21కు చేరిన మృతులు.. 28 మంది మిస్సింగ్

కోల్‌కతా, జనవరి 29: గోడౌన్లలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో మరణించిన వారి సంఖ్య 21కు చేరింది. మరో 28 మంది అదృశ్యమయ్యారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరుగవచ్చని పోలీస్ అధికారి తెలిపారు. జనవరి 26న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఆనందపూర్‌లో రెండు గోదాములు, ఒక మోమో తయారీ కర్మాగారం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వాటిలో పని చేసే కార్మికులు సజీవ దహనమయ్యారు.

కాగా, కాలిన భవనాల నుంచి తాజాగా 13 మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 21కు చేరినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇంకా 28 మంది ఆచూకీ లభించలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరుగవచ్చని అన్నారు. ఇప్పటి వరకు వెలికితీసిన 21 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించి మృతులను గుర్తించనున్నట్లు వెల్లడించారు.

మరోవైపు బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఇతర బీజేపీ నాయకులు అగ్నిప్రమాద ప్రాంతాన్ని సందర్శించాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అక్కడ నిషేధిత ఆజ్ఞలు విధించారు. ప్రజల రాకపోకలను నియంత్రించారు. ఈ నేపథ్యంలో సమీపంలోని ఆలయం నుంచి సంఘటనా స్థలానికి పాదయాత్ర కోసం అనుమతి కోరుతూ సువేందు అధికారి కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు.

## పాతబస్తీలో విషాదం.. ఫ్లాట్‌లో అక్కాతమ్ముళ్ల అనుమానాస్పద మృతి..

హైదరాబాద్, జనవరి 29:పాతబస్తీలోని సుల్తాన్‌పురా ప్రాంతంలో ఉన్న ఒక ఫ్లాట్‌లో అక్కాతమ్ముళ్ల మృతదేహాలు లభ్యమవడం సంచలనం సృష్టించింది. కొన్ని రోజులుగా ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చర్యలు చేపట్టారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను మహమ్మద్ షకీల్, అతని సోదరి సర్వార్ బేగంగా పోలీసులు గుర్తించారు. వీరు గత 40 ఏళ్లుగా ఇదే ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. సర్వార్ బేగం వికలాంగురాలు కావడంతో, ఆమె బాగోగులన్నీ సోదరుడు షకీలే చూసుకునేవాడు. వీరిద్దరూ పెళ్లి చేసుకోకుండా ఒకరికొకరు తోడుగా ఉంటున్నట్లు సమాచారం.

ఘటనా స్థలానికి చేరుకున్న మీర్ చౌక్ పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉండటంతో.. వారు మృతి చెంది కొన్ని రోజులకు పైగానే అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు.షకీల్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించి ఉండొచ్చని, వికలాంగురాలైన సర్వార్ బేగానికి ఆహారం అందించే వారు లేక ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఇతర కోణాల్లోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తున్న ఈ తోబుట్టువుల మరణం.. ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నింపింది. ఈ ఘటనపై మీర్ చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మరణానికి గల అసలు కారణాలు తెలియనున్నాయి.

## లోయలోకి దూసుకెళ్లబోయిన బస్సు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం



సిమ్లా, జనవరి 29: పర్యాటకులతో వెళుతున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పింది. కింద నది ఉన్న లోయలోకి దూసుకెళ్లబోయింది. అదృష్టవశాత్తు అందులోని పర్యాటకులకు పెను ప్రమాదం తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం చన్నిఖోడ్ సమీపంలోని భూంతర్-మణికరణ్ రహదారిపై పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు నుంచి జారి లోయలోకి దూసుకెళ్లబోయింది. అదృష్టవశాత్తూ బస్సు ముందు భాగం రోడ్డుపైకి వచ్చి ఆగింది. దీంతో లోయ కింద ప్రవహిస్తున్న పార్వతి నదిలో ఆ బస్సు పడే ప్రమాదం తప్పింది.

కాగా, ఆ బస్సులోని ప్రయాణికులు ఆందోళన చెందారు. భయంతో కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించారు. బస్సులోని పర్యాటకులను సురక్షితంగా కిందకు దించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రయాణికులు క్షేమంగా ఉండటంతో అంతా ఊరట చెందారు. లోయలోకి జారుతున్నట్లుగా ఉన్న బస్సు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## తెలంగాణ మున్సిపల్ ఎలక్షన్స్.. ఫిర్యాదుల కోసం TE-Poll యాప్..

హైదరాబాద్, జనవరి 29:తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం TE-Poll మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్లకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## ప్రమాదకరంగా మేడిగడ్డ డ్యామ్.. కేంద్రం కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ, జనవరి 29:మేడిగడ్డ బ్యారేజ్ భద్రతపై పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. మేడిగడ్డ బ్యారేజ్‌ను క్యాటగిరి-1 ప్రమాదకర డ్యామ్‌గా గుర్తించినట్లు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. దేశంలో డ్యామ్‌ల భద్రతపై అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో కేంద్రం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. టీడీపీ ఎంపీలు లక్ష్మీనారాయణ, బైరెడ్డి శబరిలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి సమాధానం ఇచ్చారు.

గత ఏడాది వర్షాకాలం అనంతరం నిర్వహించిన తనిఖీల్లో మేడిగడ్డ బ్యారేజ్‌కు సంబంధించి పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని కేంద్ర మంత్రి తెలిపారు.

డ్యాం భద్రతకు సంబంధించిన కొన్ని లోపాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, దేశవ్యాప్తంగా 50 ఏళ్లకు పైబడిన డ్యామ్‌ల సంఖ్య 1,681గా ఉందని కేంద్రం వెల్లడించింది. గత ఏడాది వర్షాకాలానికి ముందు 6,524 డ్యామ్‌లు, వర్షాకాలం అనంతరం 6,553 డ్యామ్‌లను తనిఖీ చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

డ్యామ్‌ల భద్రతపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జలశక్తి శాఖ స్పష్టం చేసింది.

## ఇద్దరు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ జనవరి 29: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా మావోయిస్టులతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో ఏకె-47 రైఫిల్, 9ఎంఎం పిస్టల్, విప్లవ సాహిత్యం, ఇతర సామాగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. అడవిలో ఇంకా మావోయిస్టులు ఉన్నారనే అనుమానంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# కుష్టు వ్యాధికి చికిత్స ఉంది - భయపడ వద్దు

## (30 జనవరి "జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినం" సందర్భంగా)

మహాత్మా గాంధీ తన జీవితకాలంలో "కుష్టు వ్యాధి" లేదా "లెప్రసీ" లేదా "హాన్సెన్స్" రోగానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే, దాని నివారణకు ఎంతగానో కృషి చేశారు. మహాత్మా గాంధీ వర్థంతి సందర్భంగా 30 జనవరి రోజు "జాతీయ కుష్టు వ్యతిరేక దినం(ఆంటీ–లెప్రసీ డే)"ను పాటించడంతో పాటు "అమరవీరుల దినోత్సవం" కూడా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. గత ఏడు దశాబ్దాలకు పైగా ప్రతి ఏట జనవరి మాసం చివరి ఆదివారం, అనగా 25 జనవరి 2026 రోజు "ప్రపంచ కుష్టు వ్యాధి దినం"గా కూడా పాటించడం జరుగుతోంది. కుష్టు వ్యాధిని ముందస్తు గుర్తించడం, తగు చికిత్స తీసుకోవడం, సూచించినా జాగ్రత్తలు తీసుకోని ఆ వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయడం, వ్యాధి పట్ల కనీస అవగాహన కలిగిన ఉండడం, వ్యాధిగ్రస్థుల పట్ల ఆదరణ చూపడం లాంటి అంశాలను వివరించడానికి జాతీయ కుష్టు వ్యతిరేక దినం వేదికలు ఉపయోగపడుతున్నాయి. కుష్టు వ్యాధి చుట్టు భయం, అపోహలు, సామాజిక కళంకాలు, వివక్ష, సామాజిక బహిష్కరణలు అంటుకొని ఉన్నాయి.

### కుష్టు వ్యాధి అధికంగా ఉన్న దేశాలు:

డబ్ల్యూహెచ్ఓ అంచనాల ప్రకారం, 2005లోనే కుష్టు వ్యాధిని నిర్మూలించబడిన ప్రజారోగ్య సమస్యగా గుర్తించినప్పటికీ 2021లో ప్రపంచవ్యాప్తంగా 1.41 లక్షల కొత్త కేసులు నమోదు అయ్యాయి. ప్రపంచ దేశాల్లో భారత్, ఇండోనేషియా, బ్రెజిల్, ఆఫ్రికన్ దేశాలు, ఆగ్నేయ ఆసి1యా దేశాల్లో దాదాపు 74 శాతం కుష్టు రోగులు ఉన్నట్లు తేలింది. ఇండియాలో 2020–21 ఏడాదిలో ప్రతి 10,000 జనాభాలో 0.4 శాతం కుష్టు రోగులు నమోదు అయ్యారు. కుష్టు రోగులు నేటికీ కళంకితులుగానే పరిగణించబడుతున్నారు. ఈ రోగులను పౌర సమాజం వెలి వేయడం జరుగుతున్నది. 1981లో ప్రతి పది వేల జనాభాకు 57.2 మందికి వ్యాధి సోకగా, 2025లో కేవలం 0.57కి తగ్గిపోవడం హర్షదాయకం. నయం చేయదగిన వ్యాధి అయినప్పటికీ దాని పట్ల అపోహలు మాత్రం డిజిటల్ కాలంలో కూడా కొనసాగడం దురదృష్టకరం.

### కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలు:

కుష్టు వ్యాధి నివారణకు బిసిజీ టీకాలు తీసుకోవడం, ముందస్తు రోగ నిర్ధారణ చేయడం, సరైన చికిత్స అందించడం, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం, గోరు వెచ్చని నీటిని తాగడం, విటమిన్లు/పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలి.

చర్మం రంగు మారడం, స్పర్శ కోల్పోవడం, శ్వాసకోశ ఇబ్బందులు, ఒత్తిడి, నొప్పి, వేడి లేదా చలి, కండరాల బలహీనత, నయం కాని పూత, కళ్ళు మూసుకోలేకపోవడం, వైకల్యం రావడం, దృష్టి లోపం లాంటి ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

కుష్టు రోగుల నోటి నుంచి విడుదలయ్యే బిందువుల ద్వారా ఈ వ్యాధి ఆరోగ్యవంతులకు వ్యాపిస్తుంది.

కుష్టు వ్యాధికి పూర్తి చికిత్స ఉన్నది. దీనిని ముందస్తు గుర్తించడం ద్వారా త్వరగా నయం చేయవచ్చు.

కుష్టు కారణ "మైకోబ్యాక్టీరియం లెప్రే" అనబడే బ్యాక్టీరియాను చంపడానికి "మల్టీ డ్రగ్ థెరపీ" అని పేర్కొనబడే మూడు ఆంటీబయాటిక్స్ కలయికను ఉపయోగిస్తారు.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారతదేశ అభివృద్ధి పథంపై బలమైన విశ్వాసం వ్యక్తం చేసిన సీఈఓలు

న్యూఢిల్లీ, జనవరి 28:ప్రస్తుతం జరుగుతున్న 'ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) 2026'లో భాగంగా ప్రపంచ ఇంధన రంగ సీఈఓలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చర్చించారు. ఈ రోజు ప్రధాని నివాసమైన లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ చర్చల సందర్భంగా భారతదేశ అభివృద్ధి పథంపై సీఈఓలు బలమైన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విధానపరమైన స్థిరత్వం, సంస్కరణల వేగం, దీర్ఘకాలిక డిమాండ్‌లోని స్పష్టతను ప్రస్తావించిన సీఈఓలు.. తమ వ్యాపార ఉనికిని భారత్‌లో విస్తరించడం, మరింత దృష్టి సారించటంపై ఆసక్తిని వ్యక్తం చేశారు.

సీఈఓలను ఆహ్వానిస్తూ ప్రధానమంత్రి.. పరిశ్రమ– ప్రభుత్వ సమన్వయం కోసం ఈ రౌండ్‌టేబుల్ సమావేశాలు ఒక కీలక వేదికగా ఉద్భవించాయని అన్నారు. ప్రపంచ పరిశ్రమ నాయకుల నుంచి వచ్చే ప్రత్యక్ష అభిప్రాయాలు.. విధాన చట్రాలను మెరుగుపరచడానికి, రంగాల వారీ సవాళ్లను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు, ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతాయని ఆయన ప్రముఖంగా చెప్పారు.

పటిష్ఠమైన భారత ఆర్థిక వేగాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ప్రధానమంత్రి.. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వేగంగా దేశం ఎదుగుతోందని, ప్రపంచ ఇంధన డిమాండ్-సరఫరా సమతుల్యతలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

భారత ఇంధన రంగంలో ఉన్న గణనీయమైన పెట్టుబడి అవకాశాలపై ప్రధానమంత్రి దృష్టి సారించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారుల అనుకూల విధాన సంస్కరణలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. చమురు అన్వేషణ, ఉత్పత్తిలో సుమారు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి సామర్థ్యం ఉన్నట్లు ఆయన చెప్పారు. కంప్రెస్డ్ బయో–గ్యాస్ (సీబీజీ) రంగంలో కూడా 30 బిలియన్ డాలర్ల అవకాశం ఉందని సీఈఓలకు తెలియజేశారు. వీటితో పాటు గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, రిఫైనరీ- పెట్రోకెమికల్ ఇంటిగ్రేషన్, సముద్రయాన- నౌకానిర్మాణ రంగాలతో సహా విస్తృతమైన ఇంధన విలువ గొలుసులో ఉన్న భారీ అవకాశాలను ఆయన వివరించారు.

ప్రపంచ ఇంధన ముఖచిత్రం అస్థిరతతో కూడి ఉన్నప్పటికీ అపారమైన అవకాశాలను కూడా అందిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. ఆవిష్కరణలు, సహకారం, లోతైన భాగస్వామ్యాల కోసం పిలుపునిచ్చిన ఆయన.. ఇంధన విలువ వ్యవస్థ అంతటా భారత్ ఒక నమ్మకమైన, విశ్వసనీయ భాగస్వామిగా సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు.

ఈ ఉన్నత స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశంలో టోటల్ ఎనర్జీస్, బీపీ, విటోల్, హెచ్‌డీ హ్యుందాయ్, హెచ్‌డీ కేఎస్ఓఈ, అకెర్, లాంజాటెక్, వేదాంత, ఇంటర్నేషనల్ ఎనర్జీ ఫోరం (ఐఈఎఫ్), ఎక్సెలరేట్, వుడ్ మెకెంజీ, ట్రాఫిగురా, స్టాట్సోలీ, ప్రజ్, రీన్యూ, ఎంఓఎల్, తదితర ప్రముఖ అంతర్జాతీయ, భారతీయ ఇంధన సంస్థలకు చెందిన 27 మంది సీఈఓలు, సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చర్చలో కేంద్ర పెట్రోలియం–సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పురి, సహాయ మంత్రి శ్రీ సురేష్ గోపి, మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగిన వార్షిక ఎన్‌సీసీ ర్యాలీ విశేషాలను పంచుకున్న ప్రధానమంతి

న్యూఢిల్లీ, జనవరి 29:నేడు ఢిల్లీలోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వార్షిక ఎన్‌సీసీ పీఎం ర్యాలీ విశేషాలను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, టాబ్లో కళాకారులు, జాతీయ రంగశాలకు చెందిన సహచరులు, దేశం నలుమూలలా నుంచి వచ్చిన యువకుల సమన్వయ ప్రదర్శనల్లో వారి కృషి స్పష్టంగా కనిపించిందని అన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన వరుస పోస్టుల్లో శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు.

"ఈ రోజు ఉదయం జరిగిన విమాన ప్రమాదం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ అజిత్ పవార్‌తోపాటు కొంతమంది సహచరులను మన నుంచి దూరం చేసింది. రాష్ట్ర, దేశ అభివృద్ధికి అజిత్ దాదా కీలక సేవలు అందించారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన ప్రతి కుటుంబాలకు ఈ విషాద సమయంలో మేము అండగా ఉంటాం".

"నేడు ప్రపంచమంతా యువ భారత్ యువ శక్తివైపు ఎంతో విశ్వాసంతో చూస్తోంది. ఈ నమ్మకానికి కారణం.. మాతృభూమిపై ఉన్న అపారమైన గౌరవం, కర్మభూమిపై ఉన్న అసమానమైన అంకితభావం"

"యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్" ఒప్పందం..అంటే భారతీయ యువతకు ఐరోపాలోని 27 దేశాల్లో సరికొత్త అవకాశాలు అందుబాటులోకి రావడమే"

"మన స్వదేశీ ఆయుధాలు ఎంత అత్యాధునికంగా, హైటెక్‌గా ఉన్నాయో ఆపరేషన్ సిందూర్ స్పష్టంగా నిరూపించింది. నేడు కృత్రిమ మేధ, రక్షణ రంగ ఆవిష్కరణలు మన సాయుధ దళాలను మరింత ఆధునికంగా మారుస్తున్నాయి. దీని వల్ల మన యువ సహచరులకు అవకాశాలు ఎంతో విస్తృతమయ్యాయి"

"యువ ఓటర్ల కోసం దేశంలో ఇప్పుడు ఒక కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ–ఎన్ఎస్ఎస్ మేరా యువ భారత్ సంస్థలు కలిసి తొలిసారి ఓటు హక్కు పొందిన వారిని గౌరవించేలా ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహించవచ్చు".

"ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరుతో ఒక మొక్క) ప్రచారంలో భాగంగా ఎన్‌సీసీ దాదాపు 8 లక్షల మొక్కలను నాటిందని తెలుసుకోవడం నాకు ఆనందంగా ఉంది. మనం నాటిన మొక్కలు చక్కగా పెరిగేలా చూడటం కూడా మన బాధ్యతే"

"రాబోయే కాలంలో మన యువత ఎంత ఫిట్‌గా ఉంటాం నేది వారికి ఎదురయ్యే అతిపెద్ద పరీక్ష. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని వారికి నా ప్రత్యేక విన్నపం".

# వైభవంగా ఆలయ 25వ వార్షికోత్సవం..

## -ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



అమరావతి, జనవరి 29:దేవుడి పట్ల, ఆలయాల పట్ల రాజకీయాలు చేయటం హేయం అని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం ఇందుపల్లిలో వెలసిన విఘ్నేశ్వర, దత్తాత్రేయస్వామి సహిత శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయ 25వ వార్షికోత్సవం వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని బాబావారిని దర్శించుకున్నారు.

ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఉత్సవంలాగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. వంటలకు ప్రసిద్ధి చెందిన ఇందుపల్లి గ్రామానికి చెందిన వారు దేశవిదేశాల నుంచి ఈ వేడుకల కోసం తరలిరావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. దేవుడు అందరి కంటే గొప్పవాడని, ఆలయాల విషయంలో రాజకీయాలు చేయడం తగదని సూచించారు.

కల్తీ నెయ్యి వాడారని ఆధారాలతో సహా తెలిసినా, తప్పును ఒప్పుకోకుండా సమర్థించుకోవడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. వైసీపీ నాయకులు తిరుమలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయవద్దని, భక్తి విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బలవర్ధనరావు, ఉంగుటూరు మండల టీడీపీ అధ్యక్షుడు కొలుసు రవీంద్ర, గ్రామ టిడిపి అధ్యక్షులు ఉయ్యూరు మురళి, ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు మొవ్వ వెంకటేశ్వ రరావు, పార్లమెంట్ టీడీపీ కమిటీ ట్రెజరర్ బెజవాడ నాగేశ్వరరావు, పిఏసిఎస్ చైర్ పర్సన్ చెరుకుమిల్లి వేణు, డీసీ చైర్మన్లు కొమ్మారెడ్డి రాజేష్, తుమ్మల జగదీష్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు తుమ్మల లత, పోతినేని రామకృష్ణ, మండల ఐటీడీపీ అధ్యక్షుడు పోతినేని బాపయ్య, దాసరి చంటి, కుమ్మరి వెంకటేశ్వరరావు, కొణిజేటి సాంబయ్య, మరడా పాపారావు, పొన్నగంటి బాలకృష్ణ, మేకల కోటేశ్వ రరావు, మాయర రమేష్, దోనేపూడి భరత్, గరిమెళ్ళ వరప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, మొవ్వ వేణు గోపాల్, కొల్లూరు చంద్రకాంత్, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోటీలకు ఎస్ఆర్ కేఆర్ క్రీడాకారులు..



భీమవరం, జనవరి 29: ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడ పివి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో ఎస్ ఆర్ కేఆర్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. విజేతగా నిలిచిన ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులను ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కి, సౌత్ జోన్ పోటీలకు జేఎన్టీయూకే టీం తరఫున ఎంపికైనట్లు కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ హరిమోహన్ చెప్పారు.

ఎంపికైన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారుల వివరాలను అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ జి సారిక, వి అవినాష్ లు అందిస్తూ జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ చెస్ విభాగములో మెన్ టీం ప్రథమ స్థానంలో నిలిచిందనీ, అదేవిధంగా నెట్ బాల్ మెన్ టీం రనర్స్ గా నిలిచారు. నెట్ బాల్ ఉమెన్స్ లో మూడవ స్థానంలో నిలిచారు.దీంతో జేఎన్టీయూకే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాలుకు మెన్ టీం లో ఎం సాహిత్, కే సాయి తేజను, నెట్ బాల్ ఉమెన్ టీంలో ఆర్ అఖిల శ్రీవల్లిని ఎంపిక చేశారు. అదేవిధంగా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి చెస్ విభాగంలో జేఎన్టీయూకే తరఫున హెచ్ హరిణి ఎంపికయ్యారని తెలిపారు. ఇప్పటికే పలు విభాగాలలో తమ కళా శాల విద్యార్థులు జేఎన్టీయూకే తరఫున సౌత్ జోన్ లో పాల్గొంటున్నారని ఒకేసారి ఇంతమంది విద్యా ర్థులు అత్యధిక క్రీడల్లో సౌత్ జోన్ కు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కాంపిటేషన్ కు కావటం పట్ల కళాశాల యాజమాన్యం క్రీడాకారులను అభినందించారు.

# కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ.

**-.స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ .**
**-స్లాట్ సేవలపై ప్రత్యేక పరిశీలన.**

కర్నూలు జనవరి 29: కర్నూలు జిల్లా కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయా అనే అంశంపై ఆయన ప్రత్యేకంగా ఈ కెపరిశీలించారు.

స్లాట్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన పౌరులకు 15 నిమిషాలలోపే దస్తావేజులు అందజేస్తున్న విధానంను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, సమయపాలనతో సేవలు అందించాలంటూ సబ్ రిజిస్ట్రార్‌తో పాటు కార్యాలయ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సేవల విషయంలో ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే, ముఖ్యమంత్రి కార్యాలయం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని డీఐజీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఫిర్యాదు వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్‌లు శ్రీనివాసరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

# భారత్ ఇటీవల సాధించిన అసాధారణ అభివృద్ధిని కూడా ప్రతిబింబించింది: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 29:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు ప్రారంభమైన సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ రోజు రాష్ట్రపతి గారు ఇచ్చిన ప్రసంగం సమగ్రంగానూ, లోతైన అవగాహనతోనూ ఉందని శ్రీ మోదీ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగం భవిష్యత్తుకు స్పష్టమైన దిశను చూపిందనీ, భారత్ ఇటీవల సాధించిన అసాధారణ అభివృద్ధిని కూడా ప్రతిబింబించిందనీ ప్రధాన మంత్రి అన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యం ఇవాళ్టి ప్రసంగంలో ప్రస్ఫుటం అయిందనీ, బలమైన, స్వయంసమృద్ధమైన దేశాన్ని తీర్చిదిద్దాలన్న మన ఉమ్మడి ఆకాంక్షకు అద్దం పట్టిందనీ శ్రీ మోదీ అన్నారు. "సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను మరింత వేగంగా పరుగులు పెట్టించాలన్న మన అందరి సంకల్పాన్నీ, నవకల్పనతో పాటు సుపరిపాలనకు ఇస్తున్న ప్రాధాన్యాన్నీ ఈ ప్రసంగం పునరుద్ఘాటించింది" అని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి గారు స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని ఇవ్వడంతో, పార్లమెంటు బడ్జెటు సమావేశాలు ఈ రోజు మొదలయ్యాయి. ఈ ప్రసంగానికి మన పార్లమెంటరీ సంప్రదాయాల్లో, ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.. రాబోయే నెలల్లో మన దేశ అభివృద్ధి ప్రయాణానికి మార్గదర్శకత్వాన్ని వహించే సామూహిక సంకల్పంతో పాటు విధాన రూపకల్పనకు ఈ ప్రసంగం మార్గదర్శకంగా ఉంటుంది.

ఇవాళ్టి ప్రసంగం సమగ్రంగా, లోతైన అవగాహనతో ఉంది. ఇది భవిష్యత్తుకు ఒక స్పష్టమైన దిశను చూపుతూనే, భారత్ ఇటీవలి అసాధారణ అభివృద్ధి ప్రయాణ జోరును ప్రతిబింబించింది. వికసిత్ భారత్‌ను నిర్మించడానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రస్ఫుటం చేసింది.. ఒక బలమైన, స్వయంసమృద్ధ దేశాన్ని తీర్చిదిద్దాలన్న మన ఉమ్మడి ఆకాంక్షకూ అద్దం పట్టింది. ఈ ప్రసంగంలో అనేక విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. రైతులు, యువత, పేదలు, అణచివేతకు గురైన వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిరంతరాయంగా చేస్తున్న ప్రయత్నాలను చాటిచెప్పింది ఈ ప్రసంగం. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను మరింత వేగంగా నడపడంతో పాటు నవకల్పనపై, సుపరిపాలనపై తీసుకొంటున్న శ్రద్ధను ఇది పునరుద్ఘాటించింది" అని పేర్కొన్నారు.

# బాల్య వివాహాల నిరోధానికి కృషి ..

## –పశ్చిమ కలెక్టర్ చదలవాడ నాగరాణి

అమరావతి, జనవరి 29: జిల్లాలో బాల్య వివాహాలు నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బాల్య వివాహ ముక్తభారత్ వంద రోజులు కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా రూపొందించిన "బాల్య వివాహ విముక్తి రథం"ను ఈ రోజు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ

సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాను బాల్యవివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్యవివాహాన్ని అరికడదాం ఆడపిల్లను చదివిద్దాం అనే స్లోగన్‌తో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీల్లేదని, అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సిబ్బందితో సమాచార వ్యవస్థను రూపొందించుకొని బాల్య వివాహాల నిరోధకానికి కృషి చేయాలన్నారు.

జిల్లాలో జనవరి 29 నుండి ఫిబ్రవరి 11వ తేదీ వరకు జిల్లా అంతటా ప్రచార రథం ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావడం ద్వారా బాల్యవివాహాల నిర్మూలనా లక్ష్యమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం చేయడమే కాకుండా వారి ఆరోగ్యం విద్య సామాజిక అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బా యికి, 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అమ్మా యికి బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహం చేసినందుకు తల్లిదండ్రులు, వివాహానికి హాజరైన బంధు, మిత్రులకు 2 సంవత్సరా ల వరకు జైలు శిక్ష, లక్ష రూపా యల వరకు జరిమానా లేదా రెం డూ విధించవచ్చుఅని హెచ్చరిం చారు. బాల్య వివాహాలు చేసే పండితులు, మౌల్వీలు, పూజారు లను కూడా శిక్షలు ఉంటాయన్నారు.

# పటిష్టమైన నిఘా..

## –జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

అమరావతి, జనవరి 29: శ్రీ సత్య సాయి జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24–7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా.ఈ రోజు ధర్మవరం పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాల బియులు, సియూలు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, తహశీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకప్పుడు కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమైన భారత విమానయాన రంగంలో గత పదేళ్లలో మునుపెన్నడూ లేనంత మార్పు: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 29: తెలంగాణలోని హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పారిశ్రామిక దిగ్గజాలకు, నిపుణులకు, పెట్టుబడిదారులకు సాదరంగా స్వాగతం పలికారు. విమానయాన రంగంలో రాబోయే కాలం కొత్త ఆశయాలతో నిండి ఉంటుందని, ఇందులో భారత్ కీలక పాత్ర పోషించబోతోందని ఆయన పేర్కొన్నారు. విమానాల తయారీ, పైలట్ శిక్షణ, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ, ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ వంటి రంగాల్లో భారత్ ఎన్నో గొప్ప అవకాశాలను కల్పిస్తోందని ప్రధాని వివరించారు. ప్రపంచ విమానయాన మార్కెట్లో భారతదేశం ఇప్పుడు ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఆయన చెప్పారు. విమానయాన రంగానికి చెందిన భాగస్వాములందరికీ ఈ 'వింగ్స్ ఇండియా' సదస్సు ఒక ముఖ్యమైన వేదిక అని ప్రధాని తెలిపారు.

గత పదేళ్లలో భారత విమానయాన రంగం ఒక చారిత్రక మార్పునకు గురైందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు విమాన ప్రయాణం కేవలం కొద్దిమంది ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమయ్యేదని, కానీ ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఎదిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, దీనికి అనుగుణంగానే భారతీయ విమానయాన సంస్థలు తమ విమానాల సంఖ్యను పెంచు కుంటున్నాయని ఆయన చెప్పారు. ఇందులో భాగంగానే గత కొన్నేళ్లలో ఏకంగా 1,500 పైగా కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని ఆయన వివరించారు.

ప్రభుత్వ దూరదృష్టి వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని ప్రధాని స్పష్టం చేశారు. విమాన ప్రయాణాన్ని కొందరికే పరిమితం చేయకుండా, ప్రతి పౌరుడు సులభంగా ప్రయాణించాలనే లక్ష్యంతో అందరికీ అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలను విమానాశ్రయాలతో అనుసంధానించినట్లు ఆయన పేర్కొన్నారు. 2014లో మన దేశంలో కేవలం 70 ఎయిర్‌పోర్ట్‌లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 160 దాటిందని ఆయన గుర్తు చేశారు. అంటే కేవలం పదేళ్లలోనే ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను రెట్టింపు పైగా పెంచామన్నారు. 100కు పైగా ఏరోడ్రోమ్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసేందుకు 'ఉడాన్' పథకాన్ని తీసుకొచ్చిందని ప్రధాని తెలిపారు. ఈ పథకం ద్వారా విమాన టికెట్ల ధరలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ఉడాన్ పథకం వల్ల ఇప్పటివరకు దాదాపు కోటిన్నర మంది ప్రయాణికులు విమానమెక్కారని ప్రధాని తెలిపారు. గతంలో అసలు విమాన రాకపోకలే లేని ఎన్నో కొత్త మార్గాల్లో ఇప్పుడు సర్వీసులు నడుస్తున్నాయని ఆయన వివరించారు.

వికసిత భారత్ లక్ష్యం దిశగా దేశం అడుగులు వేస్తున్న కొద్దీ, విమానయాన సౌకర్యాలు కూడా అనేక రెట్లు పెరుగుతాయని ప్రధాని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారతదేశంలో 400 పైగా విమానాశ్రయాలు అందుబాటులోకి వచ్చి, దేశవ్యాప్తంగా ఒక భారీ నెట్‌వర్క్ ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కీలక చర్యలను ఆయన వివరించారు: ప్రభుత్వం ఉడాన్ పథకం తదుపరి దశపై పని చేస్తోందని, దీనివల్ల ప్రాంతీయంగా విమాన సౌకర్యాలు మరింత మెరుగుపడటమే కాకుండా, ప్రయాణ ఖర్చులు కూడా అందరికీ అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. దీనితో పాటు, దేశవ్యాప్తంగా సీ-ప్లేన్ (నీటిపై దిగే విమానాలు) సేవలను విస్తరించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన చెప్పారు. దేశంలోని ప్రతి మూలకు ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంపై కూడా ప్రభుత్వం గట్టిగా దృష్టి సారించిందని ప్రధాని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను ఆధునికీకరిస్తున్నామని, దీనివల్ల చాలామంది ప్రయాణికులు విమాన ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. రాబోయే కాలంలో విమాన ప్రయాణాలకు ఉన్న డిమాండ్ మునుపెన్నడూ లేని విధంగా పెరుగుతుందని, ఇది పెట్టుబడులకు మరిన్ని గొప్ప అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాని అన్నారు.

ప్రపంచ విమానయాన రంగంలో భారత్ ఒక ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో, మన అవసరాల కోసం ఇతర దేశాల మీద ఆధారపడటం తగ్గించుకోవాలని ప్రధాని స్పష్టం చేశారు. స్వయం సమృద్ధి దిశగా మనం వేసే అడుగులు భారత్‌లో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు కూడా ఎంతో మేలు చేస్తాయని ఆయన అన్నారు. విమానాల డిజైన్, తయారీ, వాటి మరమ్మతులకు సంబంధించిన ఎంఆర్ఓ (మైంటెనన్స్, రిపేర్, ఓవర్హాల్) వ్యవస్థను బలోపేతం చేయడంపై భారత్ గట్టిగా దృష్టి పెడుతోందని ప్రధాని చెప్పారు. విమాన విడిభాగాల తయారీలోనూ, సరఫరాలోనూ భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే ఒక ముఖ్యమైన దేశంగా మారిందని ఆయన గుర్తు చేశారు. మన దేశంలోనే యుద్ధ విమానాలను, రవాణా విమానాలను తయారు చేయడం ఇప్పటికే మొదలుపెట్టామని, ఇప్పుడు పౌర విమానాల తయారీ లో కూడా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ఆయన వివరించారు. ప్రపంచ విమానయాన మార్గాల్లో భారత్‌కు ఉన్న భౌగోళిక స్థానం ఒక గొప్ప వరమని ప్రధాని చెప్పారు. దీనికి తోడు మన దేశంలో ఉన్న అద్భుతమైన దేశీయ నెట్‌వర్క్, భవిష్యత్తులో పెరగబోయే సుదూర ప్రయాణ విమానాల సంఖ్య, ఇవన్నీ కలిసి భారత విమానయాన రంగాన్ని ఎంతో బలోపేతం చేస్తాయని ఆయన వివరించారు.

భారతదేశంలోనే డిజైన్ చేసి, తయారు చేసిన ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటీఓఎల్) విమానాలు విమానయాన రంగానికి కొత్త దిశను చూపే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని పేర్కొన్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పర్యావరణ హితమైన విమానయాన ఇంధనం తయారీపై కూడా భారత్ ముమ్మరంగా పనిచేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఈ 'గ్రీన్ ఫ్యూయల్'ను ఉత్పత్తి చేయడమే కాకుండా, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి మనం ఎదుగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

విమానయాన రంగంలో భారత్ చేపడుతున్న అనేక సంస్కరణల వల్ల, మన దేశం గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న) దేశాలు, ప్రపంచ దేశాల మధ్య ఒక ప్రధాన విమానయాన ద్వారంగా మారుతోందని ప్రధాని తెలిపారు. విమానయాన పరిశ్రమతో అనుబంధం ఉన్న పెట్టుబడిదారులకు, తయారీదారులకు ఇది ఒక అద్భుతమైన సువర్ణావకాశమని ఆయన పేర్కొన్నారు.

వివిధ ప్రాంతాలు, మార్కెట్లను అనుసంధానించడంలో భారత్ వేగంగా దూసుకుపోతోందని, ముఖ్యంగా నగరాలను ఓడరేవులతో వివిధ రవాణా మార్గాల ద్వారా అనుసంధానిస్తున్నామని ప్రధాని పేర్కొన్నారు. భారత విమానయాన దార్శనికత కేవలం ప్రయాణికులకే పరిమితం కాదని, ఎయిర్ కార్గో (రవాణా) రంగానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన చెప్పారు. విమానాల ద్వారా సరకు రవాణా మరింత వేగంగా, సమర్థవంతంగా జరిగేలా అవసరమైన అన్ని నియంత్రణ సంస్కరణలపై ప్రభుత్వం పని చేస్తోందని ఆయన తెలిపారు. డిజిటల్ కార్గో ప్లాట్‌ఫామ్‌లు మొత్తం ప్రక్రియను సులభతరం చేసి మరింత పారదర్శకంగా మారుస్తున్నాయని, అలాగే ఆఫ్-ఎయిర్‌పోర్ట్ ప్రాసెసింగ్ ఏర్పాట్లు విమానాశ్రయాలపై ఉన్న భారాన్ని తగ్గిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. కార్గో నిర్వహణను మెరుగుపరచి వేగవంతం చేయడానికి ఆధునిక గోదాములు నిర్మిస్తున్నామని ప్రధాని తెలిపారు. వీటివల్ల భవిష్యత్తులో డెలివరీ సమయం తగ్గడంతో పాటు రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని ఆయన అన్నారు. భారత్ ఒక ప్రధానమైన, పోటీ సామర్థ్యం గల ట్రాన్స్-షిప్‌మెంట్ హబ్‌గా అవతరించబోతోందని స్పష్టం చేస్తూ, గోదాముల నిర్వహణ, ఫ్రైట్ ఫార్వార్డింగ్, ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్, ఈ-కామర్స్ రంగాల్లో ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులు పరిశీలించాలని శ్రీ మోదీ కోరారు.

ప్రపంచంలో ఈరోజు చాలా కొద్ది దేశాలకే విమానయాన రంగంలో భారత్‌కు ఉన్నంత విస్తృత స్థాయి, విధాన స్థిరత్వం, సాంకేతిక ఆశయాలు ఉన్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ స్వర్ణావకాశాన్ని ప్రతి దేశం, ప్రతి పరిశ్రమ నేత, ప్రతి ఆవిష్కర్త పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భారత అభివృద్ధి ప్రయాణంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా మారి, ప్రపంచ విమానయాన రంగం వృద్ధికి తమ వంతు సహకారం అందించాలని శ్రీ మోదీ కోరారు. భారత్ విమానయాన ప్రయాణంలో సహ-పైలట్లుగా భాగస్వాములవ్వాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ ఆయన ప్రధానమంత్రి ప్రసంగాన్ని ముగించారు. 'వింగ్స్ ఇండియా' కార్యక్రమం విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వీబీజీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి



ఆదిలాబాద్, జనవరి 29: వీబీజీ రామ్ జి చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోనిబీర్సాయిపేట, దంతన్ పెల్లి గ్రామపంచాయతీలలో విస్తృత0గా కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, ఉట్నూర్

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ సర్పంచ్ ల సంఘం ఉట్నూర్ మండల నూతన అధ్యక్షులు అత్రం తిరుపతిమాట్లాడుతూ?కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో మరో కొత్త చట్టంవీబి జీ రామ్ జీ చట్టాన్ని తీసుకొచ్చి గ్రామాల్లో ఉపాధి కూలీల హక్కులను పూర్తిగా కాలరాస్తుందని అని వారు విమర్శించారు.

విబిజీ రాంజీ పథకంతో కూలీలకు రానున్నరోజుల్లో పని చేసే అవకాశం తగ్గుతుందని, తక్కువ వేతనాలు చెల్లించే అవకాశం ఉంటుందని, ఉపాధి పనులను కాంట్రాంటర్ లకు ఇచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలకు ఉపది కోల్పోయే అవకాశం ఉందని, నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది అని, కూలి వేతనాల్లో దోపిడీ జరిగే అవకాశాలు ఉన్నాయి అని, మహిళలకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయి అని, దళితులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతారు అని.. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి గా భాద్యతలు తీసుకున్న వెంటనే దాని స్థానంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యదావిధంగా కొనసాగిస్తారని వారు ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో బర్సాయిపేట్ సర్పంచ్ సిపెల్లి సరిత రాజేష్, దంతంపెల్లి ఉప సర్పంచ్ మొహ్మద్ ముబిన్, బీరాయిపేట్ ఉప సర్పంచ్ ణాల ఆంజనేయులు, దంతన్ పెల్లి గ్రామ అధ్యక్షులు షేరీప్, నాయకులు భీమన్న, మతీన్, రాపెల్లిభాస్కర్, దాసరిసత్యం, శిరాజ్ ఖాన్, జాకు, రాజన్న ప్రజలు, కూలీలు పాల్గొన్నారు.

# చరిత్రాత్మక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ముగింపు..

## ముఖ్య విషయాలను ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 29:చరిత్రాత్మక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ముఖ్య విషయాలను ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. "చరిత్రాత్మక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ముగింపునకు వచ్చిందని ప్రకటిస్తున్నందుకు యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంటు శ్రీ ఒంటోనియొ కొస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంటు ఉర్సులా వాన్ డెర్ లెయెన్‌లతో పాటు నాకు కూడా చాలా సంతోషంగా ఉంది" అని శ్రీ మోదీ అన్నారు. "భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొలిక్కిరావడం మన సంబంధాల్లో ఒక కీలక ప్రగతి ప్రస్థానం. ఈ ఒప్పందం కుదిరేటట్లు ఏళ్ల తరబడి తమ శ్రమని ధారబోసి, నిబద్ధతని కనబరిచిన ఐరోపా నేతలకు నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ ఒప్పందం ఆర్థిక సంబంధాలను పెంపొందించి, మన ప్రజలకు అవకాశాలను అందించడంతో పాటు సమృద్ధ భవిష్యత్తును నిర్మించే దిశగా భారత్-ఐరోపా భాగస్వామ్యాన్ని బలపరుస్తుంది" అని శ్రీ మోదీ అన్నారు.

"యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంటు శ్రీ ఒంటోనియొ కొస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంటు ఉర్సులా వాన్ డెర్ లెయెన్‌లతో కలిసి సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ.."

"ఈయూతో కుదిరిన చరిత్రాత్మక ఒప్పందం భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు చెప్పుకోదగ్గ ప్రయోజనాలను అందిస్తుంది.. ఈ ఒప్పందం భారత్ చరిత్రలో ఇప్పటి వరకు కుదిరిన ఒప్పందాల్లో అతి పెద్ద ఒప్పందం. ఇది :

మన రైతులకూ, చిన్న పరిశ్రమలకూ యూరోప్‌లోని మార్కెట్లకు చేరుకోవడాన్ని సులభతరం చేస్తుంది.

దీంతో తయారీకి కొత్త కొత్త అవకాశాలు లభిస్తాయి.మన సేవారంగాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుంది.

# పూరేడు గుట్ట మినీ మేడారంలో?..

జయశంకర్ జిల్లా, జనవరి 29: జయశంకర్ జిల్లా చిట్యాల మండలంలోని వెంచరామి, కాల్వపల్లి గ్రామాల శివారు పూరేడు గుట్ట సమ్మక్క-సారాలమ్మ మినీ మేడారం జాతరలో ఈ రోజు రెండో రోజు సమ్మక్క తల్లి ప్రధాన పూజార్ల మధ్య పూరేడు గుట్ట నుండి సమ్మక్క గద్దెకు చేరుకుంది. దీంతో భక్తులు భారీ సంఖ్యలో బెల్లం, పసుపు, కుంకుమ, టెంకాయలతో మొక్కలు చెల్లించుకుంటున్నారు.

ఈనెల 28 నుండి31 వరకు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగనుంది. కాగా పూరేడు గుట్ట మినీ మేడారం జాతరకు ప్రభుత్వం నుండి భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు ఎమ్మెల్యే ఉత్సవ కమిటీ తెలిపారు. సమ్మక్క రాకతో పూరేడు గుట్ట జాతర జనసంద్రంగా మారింది .

# భాగస్వాములం అవుతాం...




నిర్మల్, జనవరి 29: మండల కేంద్రంలోని స్థానిక ద్రోణ పాఠశాలలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ఈ రోజు స్వదేశీ కొరకు పరుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ ప్రతిజ్ఞ చేశారు. స్వదేశీ వస్తువులనే వాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధికి మేము కూడా భాగస్వాములం అవుతామని, అమెరికా, చైనా, టర్కీ దేశాల వస్తువులని బహిష్కరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సురేష్ రెడ్డి , ప్రిన్సిపాల్ గంగాధర్, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ముత్యం, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, స్వదేశీ జాగరణ మంచ్ నిర్మల్ జిల్లా సహ సంయోజక్ శివ పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం : ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు

నల్గొండ, జనవరి 29:గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని కట్టంగూర్ ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞాన ప్రకాశ్ రావు అన్నారు. నూతనంగా ఎన్నికైన మండల సర్పంచులను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందిస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సన్మానం పొందిన సర్పంచులు మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధికి అంకిభావంతో పనిచేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ మునుగోటి రవీందర్, ఎంపీఓ స్వరాజ్యలక్ష్మి ..., సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈలు జమీల్, నవీన్, ఆర్ఐ రామారావు, ఏపీఓ కడెం రాంమోహన్, ఏపీఎం రాములు, సర్పంచులు ముక్కాముల శ్యామల, కురిమిల్ల మల్లేష్, గుల్లి నరేష్ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వడ్డె మాధవిసైదిరెడ్డి, ధార సత్తెమ్మ, తేలు సత్తయ్య, కొలిపాక సురేందర్, బెల్లి సుధాకర్, వల్లపు వెంకటనారాయణరెడ్డి, జలేంద్ర, మాద మమత, ఎన్న మౌనిక, కడారి సంధ్య, పొన్నబోయిన సత్యనారాయణ, కొవ్వాకుల రాంబాబు, చిలుముల సైదులు, ఆకిటి శంకర్, విప్పలపల్లి అనిత, పెద్ది నాగమణి పాల్గొన్నారు.

# నరసింహపురంలో సెరికల్చర్ రిసోర్స్ సెంటర్‌లో శిక్షణ తరగతులు ప్రారంభం




నల్గొండ, జనవరి 29:కనగల్ మండలం నరసింహపురం గ్రామంలో సెరికల్చర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభమైంది. గురువారం మొదటి ట్రైనింగ్ క్లాస్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనగల్ ఎంపీ డీఓ వేద, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ వినోద్ యాదవ్, డాక్టర్ భువన, డాక్టర్ రాఘవేంద్ర, రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ నికిత. హార్టికల్చర్ ఆఫీసర్ అనంత్ రెడ్డి, సెరికల్చర్ ఏడీ నర్సిరెడ్డి హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ జెల్లా పండరీకమ్, పరిసర గ్రామ సర్పంచులు సురేష్, మల్లేశం, రాజేందర్ రెడ్డి, రాజేశ్వరి నరసింహ, రైతులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు'

## -నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి

నల్గొండ, జనవరి 29:ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం నల్లగొండ పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు అలాగే సస్పెక్ట్ షీటర్లకు తన కార్యాలయంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం జరుగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీ షీటర్లు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని, బైండోవర్, నేర చరిత్ర కలిగిన ప్రతి ఒక్కరిని తాసీల్దార్ ఎదుట హాజరుపరిచి, వారి నుండి మంచి ప్రవర్తన కలిగి ఉంటామని బాండ్ రాయించాలన్నారు.

బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే, బాండ్ మొత్తాన్ని జప్తు చేయడంతో పాటు జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, ఏ రాజకీయ పార్టీకి కొమ్ముకాయకూడదు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు, అవసరమైతే జిల్లా బహిష్కరణ వేటు వేస్తామని ఆయన హెచ్చరించారు. పాత పద్ధతులు మార్చుకుని, సత్ప్రవర్తనతో జీవించాలని, లేదంటే కుటుంబాలు ఇబ్బందుల పాలవుతాయని హితవు పలికారు.

# టిఎస్ఎస్ఏ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

## - టిఎస్ఎస్ఏ ఖమ్మం జిల్లా టేబుల్ క్యాలండర్‌ను ఆవిష్కరించిన ఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు

ఖమ్మం, జనవరి 29 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ (టిఎస్ఎస్ఏ) ఖమ్మం జిల్లా కమిటీ రూపొందించిన టేబుల్ క్యాలండర్‌ను టిఎన్జివో యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...విద్యార్థి సంఘాలు యువతలో సామాజిక స్పృహను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, టిఎస్ఎస్ఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ క్యాలండర్ ఆవిష్కరణ విద్యార్థి సంఘాలకు మరింత ఉత్సాహాన్ని అందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిఎన్జివో ఎస్ యూనియన్ నాయకులు పాల్గొని విద్యార్థి సంఘాల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జివో రాష్ట్ర కార్యదర్శి

జెడ్.ఎస్.జైపాల్, టీఎన్జీవోస్ ' జాయింట్ సెక్రెటరీలు తాళ్లూరి శ్రీకాంత్, బుస చంద్రశేఖర్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షులు సి.హెచ్.సైదులు,




టీఎన్జీవోస్ నాయకులు కె.విజయ్, టిఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ల సత్యం, సాయి కుమార్ తదితరులున్నారు.

# రోడ్డు భద్రత పట్ల సమాజాన్ని జాగృతం చేయాలి : ఎస్పీ నరసింహా



నల్గొండ, జనవరి 29:విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల సమాజాన్ని జాగృతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, నియమ నిబంధనలు పాటించడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. విద్యార్థులు నిరంతరం కష్టపడి చదువుకుని ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. రోడ్డు భద్రత పట్ల తల్లిదండ్రులను, స్థానికులను చైతన్యవంతం చేయాలని కోరారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

ప్రమాద రహిత జిల్లాగా సూర్యాపేటను చూపించడం అందరి బాధ్యత అన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం అతివేగాన్ని నివారించడం వంటి పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం పట్టణ ముఖ్య కూడళ్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలంటూ వాహనాలకు స్టిక్కర్లను అంటి పెడుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆదిత్య, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎమ్మెస్సార్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్య హుండీ ఆదాయం రూ.2.31 కోట్లు



ఖమ్మం, జనవరి 29:భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రామాలయంలోని చిత్రకూట మండపంలో ఆలయంలోని హుండీలను తెరిచి దేవస్థానం ఈఓ కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.2,31,31,984 కోట్లు సమకూరినట్లుగా తేలింది. అలాగే 56 గ్రాముల బంగారం, 1,400 గ్రాముల వెండి, 544 యుఎస్ డాలర్లు, 750 దక్షిణాఫ్రికా డాలర్లు, 2,400 నేపాలీ రూపాయలు, 100 ఒమన్ బైజన్లు, 30 యూరోపియన్ డాలర్లుతో పాటు ఇతర విదేశీ కరెన్సీ భక్తులు కానుకలుగా వేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, అనిల్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సానుకూల ఫలితాలను సాధిస్తూ వ్యవసాయాన్ని ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర స్థాయి ఆవిష్కరణలు: ఆర్థిక సర్వే

న్యూఢిల్లీ, జనవరి 29:భూముల నిర్వహణ, మార్కెట్లు, నీటి నిర్వహణ, సాంకేతికత స్వీకరణ, పంట వైవిధ్యీకరణ తదితర లక్ష్య ఆధారిత సంస్కరణలను ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని పలు రాష్ట్రాలు చేపట్టాయి. ఈ కార్యక్రమాలన్నీ రాష్ట్రాల వ్యవసాయ ఫలితాలను మెరుగుపరిచాయని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఈ రోజు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 పేర్కొంది.

భూమి, వనరుల నిర్వహణ: డ్రోన్లను, కంటిన్యూయస్‌లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్ (సీవోఆర్ఎస్)ను, జీఐఎస్ సాంకేతికతను ఉపయోగించి సురక్షితమైన డిజిటల్ భూహక్కులను అందించడానికి ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు (2021)ను ఆ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. దీని ద్వారా 2025 నాటికి 6,901 గ్రామాల్లో 81 లక్షల భూ కమతాలను రీసర్వే చేయగా, సుమారుగా 86,000 సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యాయి.

ఆక్వాసాగు కోసం చౌర్ భూములను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి సమేకిత్ చౌర్ వికాస్ యోజన (2025)ను బీహార్ ప్రారంభించింది. దీని ద్వారా 22 జిల్లాల్లో మత్స్య సాగు పరిధిలోకి 1,933 హెక్టార్ల భూమిని తీసుకువచ్చింది.

మార్కెట్ సంస్కరణలు: మధ్యప్రదేశ్ ప్రారంభించిన సౌదా పత్రక్ కార్యక్రమం (2021) డిజిటల్ వేదికల ద్వారా రైతుల నుంచి ఎంఎస్‌పీ ఆధారిత కొనుగోళ్లకు వీలు కల్పించింది. ఇది మార్కెట్లలో రద్దీని తగ్గించి చెల్లింపుల్లో పారదర్శకతను పెంపొందిస్తుంది. డిసెంబర్ 2025 నాటికి 1.03 లక్షలకు పైగా లావాదేవీలు జరిగాయి.

ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను, వ్యాపారులకు వారధిగా ఈ-ఫార్మ్‌మార్కెట్ వేదిక పనిచేస్తోంది.

జల నిర్వహణ: కొత్త పథకాలు, సోలార్ పంపుల ద్వారా సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన అస్సాం రాష్ట్ర నీటి పారుదల ప్రణాళిక (2022) ద్వారా 2024-25 నాటికి సాగు విస్తీర్ణం 24.28 శాతం మేర పెరిగింది.

ఉత్తరప్రదేశ్ అమలు చేస్తున్న భూగర్భ జల నియమాలు (2020) ద్వారా భూగర్భ నీటి వినియోగం నిబంధనలను బలోపేతం చేశారు. దీని వల్ల 2025 నాటికి భూగర్భ జలాల్లో స్వల్ప పెరుగుదల కనిపించింది. అలాగే భూగర్భ జల వినియోగం కూడా పెరిగింది.

సాంకేతికత, డిజిటల్ వ్యవసాయం: కర్ణాటక అమలు చేస్తున్న ఎఫ్ఆర్యూఐటీఎస్ వేదిక (2020) తన పరిధిలోకి 55 లక్షల మంది రైతులు, వివిధ పథకాలను తీసుకువస్తూ.. డీబీటీ, ఎంఎస్‌పీ సేకరణ, పంట సర్వేలకు తోడ్పాటు ఇచ్చేలా ఏకీకృత రైతు డేటాబేస్‌ను రూపొందించింది.

క్షేత్ర స్థాయిలో ట్రాకింగు, వాతావరణ సమాచార ఆధారిత ప్రణాళికకు వీలు కల్పించేలా జీఐఎస్ ఆధారిత క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్, అగ్రి స్టాక్ స్కీమ్ (2024)ను జార్ఖండ్ ప్రారంభించింది. ఫలితాల సూచికలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. గతంలో అనుసరించిన ప్రణాళికల ఆధారంగా బీహార్ నాలుగో వ్యవసాయ ప్రణాళిక (2023-28)ను రూపొందించింది. దీనివల్ల మత్స్య, పాల ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి కనిపించింది.

పైన పేర్కొన్న ఉదాహరణలు వ్యవసాయ నిర్వహణలో సానుకూల ఫలితాలను సాధించేలా రాష్ట్ర స్థాయిలో చేపట్టిన ఆవిష్కరణలు భారతీయ వ్యవసాయ వృద్ధిని ఎలా నడిపించాయో వివరిస్తాయి.

# కష్టపడి చదవండి.. నగదు బహుమతి పొందండి : ఎంఈఓ బోయిన లింగయ్య

నల్గొండ, జనవరి 29: తుంగతుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మిషన్ టెన్త్ క్లాస్ కరపత్రాన్ని ఎంఈఓ బోయిని లింగయ్య గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి చదువుపై మరింత శ్రద్ధ పెరిగేలా ప్రోత్సహించి వారు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా మార్గనిర్దేశం చేసే గొప్ప కార్యక్రమాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తలపెట్టిందన్నారు.

ఇందులో భాగంగా విద్యార్థులు బాగా చదివి రాష్ట్ర, నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతిని ప్రోత్సాహకంగా అందివ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాన్ని పొందిన వారికి రూ.5 లక్షలు, రెండవ స్థానం పొందిన వారికి రూ.3 లక్షలు, జిల్లా టాపర్ గా నిలిచిన వారికి రూ.2 లక్షలు, నియోజక వర్గస్థాయిలో టాపర్ గా నిలిచిన వారికి రూ.లక్ష బహుమతి, మండల స్థాయిలో టాపర్ గా నిలిచిన వారికి రూ.10 వేల నగదు బహుమతిని అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ బందెల భరత్ కుమార్, తుంగతుర్తి మండల ఎగ్జిక్యూటివ్ గంట మహేందర్, తుంగతుర్తి డెవలంమెంట్ ఆఫీసర్ తొట్ల మంజుల సుధాకర్, సేల్స్ ఆఫీసర్స్ చిర్ర నరేష్, గోపగాని లింగమూర్తి, బింగి వెంకటేశ్వర్లు, పులుసు కల్పన సుధాకర్, పొదల వీరన్న, గుండ గాని లింగయ్య, తుంగతుర్తి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'ఫిబ్రవరి 12న జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి'

నల్గొండ, జనవరి 29:కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజారాం పిలుపునిచ్చారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ నల్ల చట్టాలను తెచ్చిందని, వీటి వల్ల కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకోవడం, యాజమాన్యాలతో బేరసారలు చేసుకోవడం, సమ్మె చేసుకునే హక్కు, పని గంటలు పెంచి కార్మిక వర్గంపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.15 వేలు వేతనం పొందే కార్మికులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులు, కార్మికులుగా గుర్తించబడరని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా ట్రీట్ చేస్తూ కార్మిక చట్టాలు వీరికి వర్తించకుండా దూరం చేయనున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నరసయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కోటా రామస్వామి, పాల్వాయి పున్నయ్య, మనోజ్, నరసయ్య, టీయూసీఐ నాయకులు మామిడి సుధాకర్, గుండగాని వెంకన్న పాల్గొన్నారు.

# ప్రేమ పెళ్లికి అడ్డుగా ఉన్న తల్లిదండ్రులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి చంపిన కూతురు

వికారాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ప్రేమ పెళ్లికి అడ్డుగా ఉన్న తల్లిదండ్రులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి చంపిన సంఘటన వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాచారంలో గ్రామంలో సురేఖ అనే యువతి తన తల్లిదండ్రులు, సోదరుడికి కలిసి నివసిస్తోంది.సురేఖ ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆస్పత్రిలో ఓ యువకుడు పరిచయం కావడంతో ప్రేమలో పడ్డారు. యువకుడి ప్రేమ పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. తల్లిదండ్రులను చంపేసి ప్రేమ పెళ్లి చేసుకోవచ్చని నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రులకు ఒళ్ళు నొప్పులు ఉన్నాయని చెప్పడంతో ఇద్దరికి కెటమైన్ అనే మత్తు ఇంజక్షన్ అధిక మోతాదులో ఇచ్చింది. తెల్లవారుజామున ఇద్దరు నిద్ర నుంచి లేవకపోవడంతో అమ్మనాన్న సహజంగా చనిపోయారని అందరినీ నమ్మించింది. ఆమె సోదరిడికి అనుమానం రావడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. శవ పరీక్షలో మత్తు ఇంజక్షన్‌తో చనిపోయినట్టు తేలడంతో సురేఖను పోలీసులు అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు బయటకు వచ్చాయి.

# కేరళలోని ఆర్య వైద్యశాల ధార్మిక ఆస్పత్రి శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 29: కేరళలోని ఆర్య వైద్యశాల ధార్మిక ఆస్పత్రి శతాబ్ది ఉత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా ప్రసంగించారు. ఇటువంటి పవిత్ర సందర్భంలో అందరితోనూ మమేకం కావడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఆయుర్వేద వైద్యవిధాన పరిరక్షణ, అభివృద్ధి, ఆధునికీకరణలో ఆర్య వైద్యశాల కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన కొనియాడారు. ఈ మేరకు 125 ఏళ్ల ప్రస్థానంలో ఈ సంస్థ ఆయుర్వేదాన్ని శక్తిమంతమైన చికిత్సా విధానంగా నిరూపించిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్య వైద్యశాల వ్యవస్థాపకుడు వైద్యరత్నం పి.ఎన్.వారియర్ సేవలను స్మరించుకుంటూ, ఆయుర్వేదంపై ఆయన దృక్పథం, ప్రజా సంక్షేమంపై అంకితభావం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.3

మానవాళికి శతాబ్దాలుగా సేవలందిస్తున్న భారతీయ వైద్య సంప్రదాయానికి కేరళలోని ఆర్య వైద్యశాల సజీవ చిహ్నమని ఆయన వివరించారు. మన దేశంలో ఆయుర్వేదం ఏదో ఒక కాలానికి లేదా ప్రాంతానికి పరిమితం కాదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. జీవితంపై అవగాహన, సమతౌల్య సాధన, ప్రకృతితో సమరస జీవనం దిశగా యుగయుగాల నుంచి ఈ విధానం మనకు మార్గనిర్దేశం చేస్తున్నదని ఆయన అన్నారు. ఆర్య వైద్యశాల నేడు 600కు పైగా ఆయుర్వేద ఔషధాలను తయారు చేస్తున్నదని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోగల ఈ ఆస్పత్రి శాఖలు ఆయుర్వేద విధానాల్లో చికిత్స అందిసున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 60కిపైగా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో చికిత్స కోసం ఈ వైద్యశాలలకు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆర్య వైద్యశాల తన అవిరళ కృషితో ఈ నమ్మకాన్ని సముపార్జించుకున్నదని, ఆపన్నులైన ప్రజలకు అనేక సందర్భాల్లో ఈ సంస్థ ఆశాకిరణంగా మారిందని శ్రీ మోదీ అన్నారు.

"ఆర్య వైద్యశాల సేవాధర్మం ఒక ఆలోచనకు పరిమితం కాదు. అది వారి చర్యలు, విధానాలు, వ్యవస్థలలో ప్రతిబింబించే ఒక పవిత్ర భావన" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ సంస్థ నిర్వహిస్తున్న ధార్మిక ఆస్పత్రి 100 సంవత్సరాలుగా ప్రజలకు నిరంతర సేవలందిస్తోందని తెలిపారు. ఈ ఆస్పత్రితో ముడిపడిన ప్రతి ఒక్కరి పాత్రను ఆయన ప్రశంసించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య నిపుణులు, ఇతర డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రితో సంబంధంగల ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆస్పత్రి ప్రస్థానంలో ఒక శతాబ్ద కాలం పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. కేరళ ప్రజలు ఆయుర్వేద సంప్రదాయాలను శతాబ్దాలుగా సజీవంగా ఉంచుతూ, పరిరక్షించడమే కాకుండా ఎంతగానో ప్రోత్సహిస్తు న్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

దేశంలోని ప్రాచీన వైద్య విధానాలను చాలాకాలం నుంచి వేర్వేరుగా చూస్తున్నారని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. అయితే, గత 10-11 ఏళ్లలో ఈ విధానాలు ఎంతో మారాయని పేర్కొన్నారు. ఆ మేరకు ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రజానీకం సమగ్ర దృక్పథంతో చూస్తున్నారని చెప్పారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ, యోగా విధానాలను ఒకే గొడుగు కిందకు తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ దృక్పథంతోనే తమ ప్రభుత్వం కేంద్రంలో ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. నివారక వైద్యంపై నిశితంగా దృష్టి సారిస్తూ 'జాతీయ ఆయుష్ మిషన్'ను ప్రారంభించామని గుర్తుచేశారు. తదనుగుణంగా యోగా, నివారక ఆరోగ్య సంరక్షణ, సామాజిక ఆరోగ్య సేవలందించే 12,000కుపైగా ఆయుష్ శ్రేయో కేంద్రాలపు ప్రారంభించామని శ్రీ మోదీ తెలిపారు. దేశవ్యాప్తంగాగల ఇతర ఆస్పత్రులను కూడా ఆయుష్ సేవలతో అనుసంధానించి, ఔషధ సరఫరాపైనా దృష్టి సారించామని ఆయన వివరించారు. భారత సంప్రదాయ వైద్య పరిజ్ఞాన ప్రయోజనాలు దేశం నలుమూలలాగల ప్రజలకు చేరేలా చూడాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నట్లు తెలిపారు.

ఆయుష్ రంగంపై ప్రభుత్వ విధానాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు. ఈ మేరకు ఆయుష్ ఉత్పాదక రంగం వేగంగా పురోమిస్తున్నదని చెప్పారు. భారత సంప్రదాయ సంపూర్ణ ఆరోగ్య విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఆయుష్ ఎగుమతి ప్రోత్సాహక మండలిని ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచ మార్కెట్లలో ఆయుష్ ఉత్పత్తులు, సేవలను ఇది ప్రోత్సహిస్తుందని, తదనుగుణంగా ఇప్పటికే సానుకూల ఫలితాలి స్తున్నదని శ్రీ మోదీ పేర్కొన్నారు. భారత్ 2014లో సుమారు -3,000 కోట్ల విలువైన ఆయుష్, మూలికా ఉత్పత్తులను ఎగుమతి చేయగా, ఇప్పుడది ?6,500 కోట్లకు పెరిగిందన్నారు. దీనివల్ల దేశంలోని రైతులకూ ఎంతో ప్రయోజనం కలుగుతున్నదని తెలిపారు.

ఆయుష్ ఆధారిత వైద్య పర్యాటకానికి విశ్వసనీయ గమ్యంగానూ భారత్ ఆవిర్భవిస్తోందని చెప్పారు. దీనికి మరింత ప్రోత్సాహమిస్తూ ఆయుష్ వీసాను ప్రవేశపెట్టామని, విదేశీ సందర్శకులు ఆయుర్వేద-సంప్రదాయ వైద్యంలో మెరుగైన సౌకర్యాలు పొందేందుకు ఇటువంటి చర్యలు తోడ్పడుతున్నాయని శ్రీ మోదీ అన్నారు.

ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం దాన్ని ప్రతి ప్రధాన అంతర్జాతీయ వేదికపై సగర్వంగా ప్రదర్శిస్తోందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం లేదా జి20 శిఖరాగ్ర సదస్సు వంటి వేదికలపై తాను స్వయంగా ఆయుర్వేదానికి ఒక సంపూర్ణ ఆరోగ్య మాధ్యమంగా ప్రాచుర్యం కల్పించారని పేర్కొన్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 'అంతర్జాతీయ సంప్రదాయ వైద్య కేంద్రా'న్ని ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ఇక 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద' ఇప్పటికే తన పని ప్రారంభించిందని పేర్కొన్నారు. ఆయుర్వేద ఔషధాలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం కోసం గంగానది ఒడ్డున ఔషధ మొక్కల సాగును ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మరో విజయాన్ని కూడా పంచుకుంటూ- ఐరోపా సమాఖ్యతో భారత్ చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నదని వెల్లడించారు. ఈ ఒప్పందంతో భారత సంప్రదాయ వైద్య సేవలకు, వైద్యులకు భారీ ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందని శ్రీ మోదీ అన్నారు. అలాగే భారత్‌లో పొందిన వృత్తిపరమైన అర్హత ఆధారంగా మన ఆయుర్వేద వైద్యులు నియంత్రణ రహిత ఐరోపా సమాఖ్య సభ్య దేశాలలోనూ సేవలందించే వీలుంటుందన్నారు. తద్వారా ఆయుర్వేదం, యోగాతో ముడిపడిన యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఐరోపాలో ఆయుష్ శ్రేయో కేంద్రాల ఏర్పాటుకు ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ విజయంపై ఆయుర్వేదం, ఆయుష్‌తో సంబంధంగల ప్రముఖులందరికీ అభినందనలు తెలిపారు.

భారత్ శతాబ్దాలుగా ఆయుర్వేదం విధానంతో ప్రజలకు చికిత్స అందిస్తున్నదని గుర్తుచేశారు. అయినప్పటికీ, జాతీయంగా... ప్రత్యేకించి అంతర్జాతీయంగా ఆయుర్వేద ప్రాశస్త్యాన్ని వివరించడానికి కృషి చేయాల్సి రావడం దురదృష్టకరమని ప్రధానమంత్రి ఆవేదన వెలిబుచ్చారు. ఆయుర్వేద సంబంధిత పరిశోధనలు-పత్రాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ఆయన వివరించారు. ఆయుర్వేద పద్ధతులను విజ్ఞాన శాస్త్ర సూత్రాల ప్రాతిపదికన పరీక్షిస్తే ప్రజల విశ్వాసం బలోపేతం కాగలదన్నారు. ఈ దిశగా సీఎస్ఐఆర్, ఐఐటీ వంటి సంస్థలతో సంయుక్తంగా ఆయుర్వేదాన్ని నిరంతరం విజ్ఞాన శాస్త్ర-పరిశోధన అనే గీటురాయిపై పరీక్షించడంలో ఆర్య వైద్యశాల కృషిని శ్రీ మోదీ కొనియాడారు. ఔషధ, క్లినికల్ పరిశోధనలతోపాటు కేన్సర్ చికిత్సపైనా ఈ సంస్థ దృష్టి సారించిందని, ఆయుష్ మంత్రిత్వ శాఖ తోడ్పాటుతో పరిశోధనల నిర్వహణ దిశగా ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

కాలానుగుణ మార్పులను అనుసరిస్తూ, ఆయుర్వేదంలో ఆధునిక సాంకేతికతలు సహా కృత్రిమ మేధ వినియోగం పెంచాలని ప్రధానమంత్రి అన్నారు. వ్యాధి సంక్రమణ అంచనాలతోపాటు భిన్న పద్ధతులలో చికిత్స చేసే వినూత్న విధానాలను ఇది సాధ్యం చేస్తుందని చెప్పారు. సంప్రదాయం-ఆధునికతల సమ్మేళనం ఆరోగ్య సంరక్షణపై జన జీవనంలో విశ్వాసానికి పునాది కాగలదని ఆర్య వైద్యశాల నిరూపించినట్లు ఆయన అన్నారు. ఈ సంస్థ ఆయుర్వేదంపై ప్రాచీన అవగాహనను పరిరక్షిస్తూ, ఆధునిక అవసరాల మేరకు చికిత్సను క్రమబద్ధీకరించి రోగులకు సేవలందిస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిదాయక కృషికిగాను ఆయన ఆర్య వైద్యశాలకు మరోసారి అభినందనలు తెలిపారు. ఈ సంస్థ భవిష్యత్తులోనూ ఇదే అంకితభావం, సేవా స్ఫూర్తితో ప్రజల జీవితాలను మెరుగుపరచాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కేరళ గవర్నర్ శ్రీ రాజేంద్ర అర్లేకర్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# సర్వజన హితం కోసమే రాజశ్యామల యాగం

## - డా॥ వకుళాభరణం కృష్ణమోహన్ రావు



హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆధ్యాత్మిక భావనతో నిర్వహించే కార్యక్రమాలు సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతాయని తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. సనాతన ధర్మం, సంప్రదాయ ఆచారాలు, పూజా విధానాలు ప్రజలను సన్మార్గంలో నడిపించడానికే ఉద్దేశించబడ్డవని ఆయన స్పష్టం చేశారు. రాజశ్యామల యాగం వంటి యజ్ఞాలు, హోమ క్రతువులు సర్వజన హితాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహించబడతాయని తెలిపారు. ధర్మ పరిరక్షణ ద్వారా సమాజంలో శాంతి, శ్రేయస్సు నెలకొల్పడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.జనవరి 19 నుంచి 28 వరకూ పది రోజుల పాటు శ్రీ రాజశ్యామల దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించగా, ఇవాళ పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ మహోత్సవాలు శ్రీ విద్యా శక్తి పీఠం ఆధిపతి శ్రీ నారాయణం చక్రవర్తుల శర్మ మార్గ దర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. కార్యక్రమాలు శ్రీ విద్యా శక్తి పీఠంలో, ఆర్కే పురం, హైదరాబాద్‌లో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పీఠ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది.ముగింపు రోజైన ఇవాళ బుధవారం వేదపండితులు, ఘనపాఠులు ఆధ్వర్యంలో శాస్త్రోక్త విధానంలో యాగాంగ రంగా వైభవంగా పూర్ణాహుతి నిర్వహించబడింది. హోమాలు, యాగ క్రతువులు, పారాయణాలు వేదోక్తంగా జరిగాయి.పది రోజుల పాటు మహిళా భక్తుల విశేష పాల్గొనతో కుంకుమార్చన, విష్ణు అష్టోత్తర, సహస్రనామావళి పారాయణం వంటి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపాసకులు రాంసుధాకర్ శర్మ పాల్గొన్నారు.

# గత 5 ఏళ్లలో 4.4 శాతం సగటు వార్షిక వృద్ధి

# రేటును నమోదు చేసిన వ్యవసాయ రంగం

న్యూఢిల్లీ, జనవరి 29:భారత వ్యవసాయ రంగం పటిష్ఠమైన దృఢత్వాన్ని ప్రదర్శించటంతో పాటు అనుబంధ రంగాల నుంచి లభించిన ప్రధాన తోడ్పాటుతో స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సర్వే తెలిపింది.

ఇటీవలి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగినప్పటికీ ఆదాయ అవకాశాలను పెంపొందించడంలో, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడంలో పశుపోషణ, మత్స్య సంపద, ఉద్యానవన పంటల వంటి అధిక విలువ కలిగిన అనుబంధ రంగాలు మరింత కీలక పాత్ర పోషిస్తున్నాయని సర్వే వెల్లడించింది.

సర్వే ప్రకారం గత ఐదేళ్లలో స్థిర ధరల వద్ద వ్యవసాయం, అనుబంధ రంగాల సగటు వార్షిక వృద్ధి రేటు సుమారు 4.4 శాతంగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 3.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2015-16 నుంచి 2024-25 వరకు దశాబ్ద వృద్ధి 4.45 శాతంగా ఉంది. క్రితం దశాబ్దాలతో పోల్చితే ఇదే అత్యధికం. పశుపోషణ (7.1 శాతం), మత్స్య సంపద - ఆక్వాకల్చర్ (8.8 శాతం) రంగాల బలమైన పనితీరు వల్ల ఇది సాధ్యమైంది. వీటి తర్వాత పంటల రంగం 3.5 శాతం వృద్ధిని సాధించింది.

2014-15, 2023-2024 ఆర్థిక సంవత్సరాల మధ్య పశు పోషణ రంగం భారీ వృద్ధిని నమోదు చేసింది. దీని జీవీఏ ప్రస్తుత ధరల వద్ద దాదాపు 195 శాతం పెరిగినీది. ఈ రంగం 12.77 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) నమోదు చేసింది. మత్స్య రంగం కూడా అద్భుతమైన ప్రదర్శనను కనబరిచింది. 2004-14తో పోలిస్తే 2014-2025లో చేపల ఉత్పత్తి 140 శాతం కంటే ఎక్కువ (88.14 లక్షల టన్నులు) పెరిగింది. ఈ విధంగా రైతు ఆదాయాన్ని పెంచడంలో అనుబంధ రంగాలు ముఖ్యమైన వృద్ధి చోదక శక్తులు, కీలక సహకార రంగాలుగా ఆవిర్భవిస్తున్నాయి.

భారతదేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి స్థిరమైన వృద్ధిని సాధించింది. 2024?25 వ్యవసాయ సంవత్సరంలో ఇది 3,577.3 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) చేరుకుందన్న అంచనా ఉన్నట్లు సర్వే తెలిపింది. గత ఏడాదితో పోల్చితే ఇది 254.3 ఎల్ఎంటీ ఎక్కువ. బియ్యం, గోధుమలు, మొక్కజొన్న, తృణధాన్యాల (శ్రీ అన్న) అధిక దిగుబడి కారణంగా ఈ వృద్ధి సాధ్యమైంది.

వ్యవసాయ జీవీఏలో సుమారు 33 శాతం వాటా కలిగిన ఉద్యానవన రంగం.. దేశ వ్యవసాయ వృద్ధి పథంలో ఒక ముఖ్యమైన ఉపరంగంగా అవతరించింది. 2024-25లో అంచనావేసిన 362.08 ఎంటీల ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధిగమిస్తూ ఉద్యానవన ఉత్పత్తి 362.08 ఎంటీలకు చేరుకుంది. ఆగస్టు 2025 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం 2013?14లో 280.70 మిలియన్ టన్నులుగా ఉన్న ఉద్యానవన ఉత్పత్తి.. 2024?25 నాటికి 367.72 మిలియన్ టన్నులకు పెరిగింది.

ఈ వృద్ధి అన్ని రంగాల్లో కనిపించింది. ఈ సంవత్సరంలో 114.51 మిలియన్ టన్నుల పండ్లు, 219.67 మిలియన్ టన్నుల కూరగాయలు, 33.54 మిలియన్ టన్నుల ఇతర ఉద్యానవన పంటల ఉత్పత్తి నమోదైంది. ఇది వ్యవసాయ ఉత్పత్తి, విలువలో ఈ రంగానికి పెరుగుతున్న వాటాను తెలియజేస్తోంది.

వీటితో పాటు దాదాపు 25 శాతం అంతర్జాతీయ వాటాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎండు ఉల్లి ఉత్పత్తిదారుగా ఉంది. కూరగాయలు, పండ్లు, బంగాళదుంపల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉంది. ఇందులోని ప్రతి విభాగంలో అంతర్జాతీయ ఉత్పత్తిలో దేశం సుమారు 12-13 శాతం వాటాను కలిగి ఉంది. ఈ విజయాలు ఉద్యానవన రంగంలో దేశానికి ఉన్న బలమైన ఉనికిని, ప్రపంచ ఆహార డిమాండ్‌ను తీర్చడంలో పెరుగుతున్న భారత్ పాత్రను,అధిక విలువ కలిగిన పంటల ఉత్పత్తిలోని అవకాశాలను ప్రధానంగా తెలియజేస్తున్నాయి.

సమగ్ర వృద్ధిని ముందుకు తీసుకెళ్లటం, కోట్ల మంది ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంలో 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు వ్యవసాయం కేంద్రబిందువుగా ఉంటుందన్న వ్యాఖ్యతో సర్వేలోని వ్యవసాయ విభాగం ముగిసింది. దేశ జీడీపీకి గణనీయంగా సహకరిస్తున్న పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య సంపద, ఉద్యానవన రంగాల వంటి కీలక విభాగాలలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది.

# మన శరీరానికి ఎంతో మేలు చేసే అవకాడ.. జామ కాయ

## గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం రోగనిరోధక శక్తిని పెంచడంలో దోహదం

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మన శరీరానికి జామ, అవకాడో రెండు కూడా ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి ఎన్నో పోషకాలను కలిగి ఉంటాయి. ఇవి రెండు కూడా వేరు వేరు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జామకాయలలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి వంటి పోషకాలతో పాటు తక్కువ క్యాలరీలు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గడంలో ఇలా అనేక రకాలుగా జామకాయలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే అవకాడో కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో అనేక రకాలుగా అవకాడో మనకు సహాయపడుతుంది. ఇవి రెండు కూడా మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి బరువు తగ్గడంలో, చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, శరీర ఆరోగ్యానికి ఏది మేలు చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

బరువు తగ్గేందుకు..

పోషకాల పరంగా 100 గ్రాముల జామకాయలో 68 క్యాలరీలు, మన శరీర అవసరాలకు మించిన విటమిన్ సి, ఫోలేట్, పొటాషియం, లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల అవకాడోలో 160 కిలో క్యాలరీలు, ఒలీక్ ఆమ్లం, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, బి కాంప్లెక్స్ విటమిన్స్ తో పాటు విటమిన్ కె, ఇ వంటి పోషకాలు ఉంటాయి. జామకాయలో తక్కువ క్యాలరీలతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. రోగనిరోధక



శక్తికి, జీర్ణక్రియకు జామకాయ అనువైనది అయితే మెదడు, గుండె ఆరోగ్యానికి అవకాడో అనువైనది. కనుక మన శరీర అవసరాలకు తగినట్టు ఎంపిక చేసుకోవడం మంచిది. బరువు తగ్గాలనుకునే వారు జామకాయను తీసుకోవడం మంచిది. దీనిలో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక దీనిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరలు కూడా వేగంగా పెరగకుండా ఉంటాయి. ఇక అవకాడో ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ దీనిలో 250 నుండి 300 క్యాలరీల వరకు ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. కనుక దీనిని పావు లేదా అర ముక్క మోతాదులో మితంగా తీసుకోవాలి. బరువు తగ్గాలనుకునే వారు అవకాడోను చిన్న మొత్తంలో తీసుకోవడం మంచిది.

రోగనిరోధక శక్తి, చర్మం, జుట్టు ఆరోగ్యం..

అదే విధంగా శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో జామకాయ ముందు ఉంటుందని చెప్పవచ్చు. దీనిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ సి తెల్లరక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిలో, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. జామకాయను తీసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గడంతో పాటు కంటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో అవకాడో ముందంజలో ఉంటుందని చెప్పవచ్చు. దీనిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో దాదాపు రెండు పండ్లు కూడా మనకు మేలు చేస్తాయి.

దేనిని ఎంచుకోవాలి..

జామ, అవకాడో రెండు కూడా మనకు అనేక భిన్నమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జామకాయ మనకు అందరికీ అందుబాటు ధరల్లో లభిస్తుంది. అవకాడో కొద్దిగా ధర ఎక్కువగా ఉంటుంది. దీనిని అందరూ కొనుగోలు చేసి తీసుకోలేరు. బరువు తగ్గాలనుకునే వారు, జీర్ణక్రియను మెరుగువరుచుకోవాలనుకునే వారు జామకాయను ఎంచుకోవడం మంచిది. గుండె ఆరోగ్యం కోరుకునే వారు, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కోరుకునే వారు అవకాడోను తీసుకోవడం మంచిది. జామకాయను అల్పాహారంలో భాగంగా లేదా మధ్యాహ్నం రిఫ్రెష్ ఫ్రూట్ గా తీసుకోవచ్చు. భోజనం లేదా స్నాక్స్ గా అవకాడోను తీసుకోవచ్చు. మన శరీర అవసరాలను బట్టి మన ఆర్థిక పరిస్థితిని బట్టి సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

**-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్ జనవరి 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఆటో యూనియన్ ల నాయకులతో బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఇతర జిల్లాల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలిగించటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అన్ని ఆటో సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే కార్మిక శాఖ మంత్రి ని కలుస్తామన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్నప్పటికీ జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లను అడ్డుకోవటం సరికాదన్నారు. కార్మికుల భద్రతతో పాటు వారి ఉపాధి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు.



ఈ సమస్యపై సంబంధిత పోలీస్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాల ఆటో డ్రైవర్లకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆటో జాగృతి అధ్యక్షుడు ఎంఏ సలీమ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఐ ఎన్ టీయూసీ జనరల్ సెక్రెటరీ మల్లేశం గౌడ్, టీ ఏడీఎస్ ప్రెసిడెంట్ సత్తిరెడ్డి, టీ ఎన్ టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, జీ యూ టీఎన్ అధ్యక్షులు శ్రీనివాస్, బీ ఆర్టీయూ అధ్యక్షుడు పరశురాముడు, తెలంగాణ జాగృతి నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రియురాలును ఆత్మహత్యకు ప్రేరిపించిన ప్రియుడు

**-యువతి మృతి .. పారిపోయిన ప్రియుడు..పోలీస్ ల అరెస్ట్**

తిరువనంతపురం జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఓ యువతి ఆత్మహత్య కేసు విచారణలో అనూహ్య మలుపులు తిరిగింది. ప్రియుడు ఆమెను ఆత్మహత్యకు ప్రేరిపించి అక్కడి నుంచి అతడు పారిపోయాడు. ఈ సంఘటన కేరళ రాష్ట్రం కోఝికోడ్ ప్రాంతంలో జరిగింది. ఎలాతుర్ కు చెందిన వైశాఖన్ అనే వ్యక్తి తన దగ్గర బంధువైన యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం భార్యకు తెలిస్తే భయం ప్రియురాలి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. యువతితో అక్రమ సంబంధం కొనసాగిస్తే బంధువులలో తన పరువు పోతుందని ఆమె పలుమార్లు చెప్పడంతో పాటు ఫుల్‌స్టాప్ పెడుతామని చెప్పాడు. ప్రియుడు లేకుండా తాను బతకలేనని ప్రియురాలు పలుమార్లు ప్రియుడికి చెప్పడంతో వివాహేతర సంబంధం కొనసాగించాలని కోరింది. ఇద్దరం కలిసి చనిపోదామని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమెను తాను పని చేసే మలిక్కడావు గ్రామంలోని వర్క్‌షాపుకు రమ్మని కబురు పంపాడు. ఇద్దరు వేర్వేరు కూర్చీలపై నిలబడి మెడకు తాళ్లు బిగించుకున్నాడు. ఆమె కూర్చీని తొలగించింది కానీ ప్రియుడు కూర్చీ దిగి పారిపోయాడు. యువతి ఉరి బిగించుకొని అక్కడే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సిసిటివి పుటేజీని గమనించగా యువతితో, వైశాఖన్ వర్క్‌షాపులో వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నిజాలు ఒప్పుకున్నాడు. మైనర్‌గా ఉన్నప్పటి నుంచే ఆమెతో సంబంధాన్ని కొనసాగించడంతో అతడిపై పోక్సో చట్టంతో పాటు పలు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా ఉపాధ్యక్షురాలుగా గద్దాస్ శైలజ

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా ఉపాధ్యక్షురాలుగా విద్యానగర్ కు చెందిన గద్దాస్ శైలజ నియమితులైనారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై రాజకీయ దాడి ప్రారం భించిందని విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్ని కల్లో అన్యాయం చేసి, ఇప్పు డు మున్సిపల్ ఎన్నికల్లో కూడా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయ కుండా ఎన్నికలు నిర్వహించడం బహుజన సమాజాన్ని మోసం చేయడమేనని అన్నారు."రాష్ట్ర జనాభాలో 56-60 శాతం ఉన్న బీసీలకు కేవలం 31 శాతం చైర్మన్ పదవులా? 15 శాతం కూడా లేనిఅగ్రకులాలకు 61మున్సిపల్ చైర్మన్ స్థానాలా? ఇది సామాజిక న్యాయమా. లేక కాంగ్రెస్ రాజకీయ కుతంత్రామా?" అని ప్రశ్నిం చారు. 42 శాతం అమలు చేసి ఉంటే బీసీలకు 52 చైర్మన్ స్థానాలు రావాల్సి ఉండేదని, ప్రభుత్వం మా ట తప్పడం వల్ల 14 స్థానాలు నష్టపోయా మని చెప్పారు. తాజా జనాభా లెక్కల ప్రకారం 56 శాతం మేర కేటాయిస్తే 68 స్థానాలు రావాల్సి ఉండగా, 30 స్థానాలు బీసీల నుంచి లాక్కున్నారని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవు లు కేవలం హోదాలు కాదని, వేల కోట్ల రూ పాయల అభివృద్ధి నిధులపై అధికారం ఉన్న కీలక స్థానాలని తెలిపారు. ఒక్కో మున్సిపాలిటీలో నగటున రూ. 100కోట్ల బడ్జెట్ ఉంటే, బీసీలకు చైర్మన్ స్థానా లు తగ్గిం చడం ద్వారా సుమారు రూ. 1400 కోట్ల అభివృద్ధి నిధుల నుంచి బీసీలను దూ రం చేస్తు న్నారని మండిపడ్డారు. 10 కార్పొరే షన్లలో ఒక్కో మేయర్ పరిధి రూ. 500 కోట్ల కు పైగా ఉంటే, బీసీల కు కేవలం 3 మేయర్ స్థానాలు ఇవ్వడం ద్వారా దాదాపు రూ. 3500 కోట్ల పాలనా నిర్ణయాల నుంచి బీసీలను తప్పించారని విమర్శించారు. కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాల్లోనూ బీసీ లకు 28 శాతం మాత్రమే కేటాయించడం ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. 2704100కోట్ల బడ్జెట్ ఉంటే, బీసీలకు చైర్మన్ స్థానా లు తగ్గిం చడం ద్వారా సుమారు రూ. 1400 కోట్ల అభివృద్ధి నిధుల నుంచి బీసీలను దూ రం చేస్తు న్నారని మండిపడ్డారు. 10 కార్పొరే షన్లలో ఒక్కో మేయర్ పరిధి రూ. 500 కోట్ల కు పైగా ఉంటే, బీసీల కు కేవలం 3 మేయర్ స్థానాలు ఇవ్వడం ద్వారా దాదాపు రూ. 3500 కోట్ల పాలనా నిర్ణయాల నుంచి బీసీలను తప్పించారని విమర్శించారు. కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాల్లోనూ బీసీ లకు 28 శాతం మాత్రమే కేటాయించడం ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఈకార్యక్రమం లో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామంజనేలు, రాజేందర్, నికిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులు లా అండ్ ఆర్డర్ కు బదులుగా..ల్యాండ్ సెటిల్మెంట్ల కు ప్రాధాన్యత

**-టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పోలీస్ అధికారులు లా అండ్ ఆర్డర్ కు బదులుగా..ల్యాండ్ సెటిల్మెంట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేసారు. పోలీస్ అధికారులు బిఆర్ఎస్ ప్రభుత్వం లో కార్యకర్తలు గా పని చేసి అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. బుదవారం గాంధీ భవన్ లో మీడియా చిట్ చాట్ లో మాట్లాడారు. బిఆర్ ఎస్ లో ఫ్రెండ్లి పోలీస్ అంటే డ్రగ్స్ పెడల ర్లకు ఫ్రెండ్లి పోలీస్ కొందరు పోలీస్ అధికా రులు హెడ్ లైన్స్ లో రావడానికి ఉన్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నార న్నారు.. బీఆర్ఎస్ హాయంలో చేసినట్లు అర్ధరాత్రి అరెస్టులతో వార్తల్లో హైలెట్ కావాలని చూస్తున్నారు..ఎవరిని అరెస్టు చేసిన ప్రొసీజర్ ప్రకారమే వెళ్లాలినగర కమిషనర్ అమాయకుల మీద ప్రతాపం చూపిస్తు న్నారు. ఏ కేసు అయినా, ఏ విచారణ అయినా.. సీఎం రేవంత్ రెడ్డి చట్ట ప్రకారం, ప్రజా స్వామ్యబద్ధంగా వెళ్ళమని చెప్తున్నారుకానీ కొందరు అధికారులు ఇన్వెస్టి గేషన్ అంటూ అర్ధరాత్రి అరెస్ట్ చేస్తూ, ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారు..దానిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. బిఆర్ఎస్ హయాంలో పని చేసినట్లు అధికారులు పని చేస్తామంటే కుదరదు. ప్రభుత్వం మారింది.. పాలకులు మారారనేది, ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు అనేది గుర్తు పెట్టుకోవాలి. రాజ్యాంగ బద్దంగా పని చేస్తే మంచిదినైని లో టెండర్లలో కాంట్రాక్టు అలేకేషనే కాలేదు, బొగ్గు తీయనేలేదు... స్కామ్ ఎట్లా జరుగుద్ది..? గతం లో 2జి స్కాం అన్నారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో ఇక్కడైనా నిరూపించారా? నేషనల్ హెరాల్డ్ కేసులో ఎక్కడైనా ఒక్క రూపాయి రాహుల్ గాంధీ, సోనియా గాంధీ అకౌంట్ లో పడినట్లు నిరూపించారా..?బీజేపీ ఎంపీలు ఉన్న ప్రాంతంలో సర్పంచ్ లు ఎంతమంది గెలిచారు? మున్సిపల్ ఎన్నికల్లో వాళ్లు గెలవడానికి...! మా నాయకులు ఉత్తర కుమార మాటలు మానేయాలని హితవు పలికారు. బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చేరిన చోట సమన్వ యలోపం జరుగుతుంది. ప్రభుత్వం- పార్టీని సమన్వయం చేయడానికి సమన్వయ కమిటీ త్వరగా వేయాలని కోరుకుంటు న్నాను...కొత్త పాత నేతలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఇన్ఛార్జ్ మంత్రులదే..అభివృద్ధి కొరకు అంటూ కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ను బ్లాక్ మెయిల్ చేయాలనుకుంటే కుదరదు. వారు పాత కాంగ్రెస్ వారిని సమన్వయం చేసుకోవాలి.. దానం నాగేందర్ అంశం స్పీకర్ పరిధిలో ఉందిస్పీకర్ నిర్ణయం జరిగాక కోర్టులు అంగీకరించొచ్చు తిరస్కరించొచ్చు..లిక్కర్ స్కామ్ లో ఇరికిన కవిత ను కాంగ్రెస్ లో చేర్చు కునే దుస్థితి కాంగ్రెస్ కు లేదుకవిత బిఆర్ఎస్ లో ఉన్నప్పుడే ఆ పార్టీని మట్టి కరిపించాం ఇప్పుడు కవిత ను తీసుకునే అవసరం కాంగ్రెస్ కు లేదుతెలంగాణ ప్రజలు ప్రాణ త్యాగాలు చేసుకుంటే కేటిఆర్, హరీష్, రావు కవితలు అమెరికా లో కంపెనీలు పెట్టారు.

# 30 నుండి శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి సంస్థ 25 వ వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక సామాజిక ధార్మిక సంస్థ 25 వ వార్షికోత్సవం సందర్భంగా నేరెడ్మెట్ దీన్ దయాళ్ నగర్ శ్రీ విజయ వినాయక దేవాలయంలో శుక్ర శని ఆదివారము మూడు రోజులు విశేషముగా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమములు , గణపతి, నవగ్రహ, రుద్ర, సరస్వతి హోమములు అన్నదానం మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పగిరి మరియు శైవ మహాపీఠం ఆస్థాన పండితులు సంస్కృతాంధ్ర పండితులు ,డాక్టర్ ముదిగొండ అమరనాథ శర్మ మరియు ముత్యంపేట గౌరీ శంకర శర్మల చే సంస్కృతాంధ్రఅష్టావధానం . నిర్వహించనున్నారు. అక్షర కౌముది సేవ సంస్థ అధ్యక్షులు , కవి, రచయిత, డా తులసి వెంకట రమణాచార్యులు, శ్రీ లక్ష్మీ గణపతి ఉపాసకులు, సంస్కృత అధ్యాపకులు డాక్టర్ నిర్మల సిద్ధరామేశ్వర శర్మ ,విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ముదిగొండ శరభ లింగ శర్మ ,సంస్కృతాంధ్ర భాష అభిమానులు ముత్యంపేట మల్లికార్జున శర్మ, శ్రీ శైవ మహాపీఠం మల్కాజ్గిరి శాఖ అధ్యక్షులు ఎస్. పి .సతీష్ చంద్ర ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కవి , రచయిత ,ముదిగొండ సంతోష్ కుమార్ శర్మ,అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలేజ్ సంస్కృత ఉపన్యాసకులు డా కృష్ణమూర్తి ,కవి రచయిత్రి మూర్తి శ్రీదేవి,ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయులు డా. రాయక కృష్ణమూర్తి అవధానము లో పృచ్ఛకులు గా పాల్గొంటున్నారు. మానస ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ కార్యదర్శి , సాహితీ వేత్త, రఘుశ్రీ, శ్రీ నిర్మల శివానంద ఆశ్రమ అధ్యక్షులు, జ్యోతిష విద్వాంసులు, నిర్మల రామనాథ శర్మ , సంస్కృతాంధ్ర పండితులు, శ్రీ మున్నా లాల్ సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు శివ శ్రీ నిర్మల నీలకంఠశాస్త్రి , గౌతమాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు రాజవీరేశ్వర శాస్త్రి బ్రహ్మానందం శర్మ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటున్నారని ,మరియు సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు, సంస్కృత విద్వాంసులు , పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేయవలసినదిగా శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికా నాశర్మ సంధ్య దంపతులు కోరారు

## బిజెపి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల మానిటరింగ్ కమిటీ సమావేశం

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహారాష్ట్ర మంత్రి ఉ ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీ అశీష్ షెలార్, రాజస్థాన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఉ కో-ఇన్‌చార్జ్ శ్రీ అశోక్ పర్ణామి, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, బిజెపి సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహం, అలాగే పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కమిటీ దిశానిర్దేశం చేసింది.

# సీపీఐ (ఎమ్ ఎల్) చంద్ర పుల్లా రెడ్డి పార్టీ అనుబంధ కేంద్ర, రాష్ట్ర, ప్రజా సంఘాలు రద్దు

**-పిఓడబ్లు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు**

**- త్వరలో పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం**

**-సీపీఐ( ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్**

హైదరాబాద్ జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సంగారెడ్డి పట్టణం లో జరిగిన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో ఇటీవల జరిగినా కొన్ని పరిణామాలతో పార్టీ కి నష్టం కల్గే చర్యల వల్ల పార్టీ పొలిట్ బ్యూరో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కొన్ని తీర్మానాలు చెయ్యడం జరిగిందని సీపీఐ( ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ నేడొక ప్రకటనలో తెలిపారు. పార్టీ అనుబంధ ప్రజా సంఘాలు ఇఫ్టు, పిఓడబ్లు ,పివైఎల్ ,రైతు కూలి సంఘం, పిడిఎస్యు తదితర ప్రజా సంఘాల ను రద్దు చేయ్యడం జరిగింది,ఇక పై ఈ సంఘాల తో ఉన్న నాయకత్వం ఈ సంఘాల పేరుతో పని చెయ్యరాదని పార్టీ పొలిట్ బ్యూరో కోరడమైనది,త్వరలో జాతీయ స్థాయి ప్లీనరీలో పార్టీ ప్రజా సంఘాలు ఏర్పాటు చేస్తుందని,కొన్ని ప్రత్యేక పరిస్తితి లో పిఓడబ్లు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసింది జాతీయ కార్యదర్శి వెలుగు వనిత,ప్రసిడెంట్ గా సంపంగి పద్మక్క ,గడిపే విమల ను పార్టీ పొలిట్ బ్యూరో నియామకం చేసింది

